AL - HILAL

# నెలవంక

మాస పత్రిక

Vol 5, Issue: 34 August - 2009

مجلة الهلال (باللغة التلغوية) - ملحق مجلة البشرى




## పట్టి గొప్పలు చెప్పుకోకోయ్

## ఖుర్‌ఆన్ అవతరించిన మాసం

## అహంకార పరిణామం

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE

ఉచితం

شَهْرُ رَمَضَانَ الَّذِي أُنزِلَ فِيهِ الْقُرْآنُ هُدًى لِّلنَّاسِ
وَبَيِّنَاتٍ مِّنَ الْهُدَىٰ وَالْفُرْقَانِ

“రమజాను నెల ఖుర్‌ఆన్ అవతరింపజేయబడిన నెల. అది మానవులందరికీ మార్గదర్శకం. అందులో సన్మార్గంతోపాటు సత్యాసత్యాలను వేరుపరచే స్పష్టమైన నిదర్శనాలు ఉన్నాయి. కనుక ఎవరు ఈ నెలను చూస్తారో వారు ఉపవాసాలుండాలి”.

(దివ్య ఖుర్‌ఆన్ – 2: 185)



సామాజిక, సాంస్కృతిక, సందేశాత్మక మాస పత్రిక

# నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 5, ISSUE: 34
AUGUST 2009

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Muhd. Azeezur Rahman

ASSOCIATE EDITORS
Mujahid Khan Omeri
Syed Abdus Salam Omeri

EDITORIAL BOARD
Abdul Qadir Omeri
Sk Abdus Salam Omeri
Tahera Begum

DESIGN
Noushad Zainulabdeen

www.zukhruf.net
Tel. 99993072

PUBLISHED BY
IPC
Islam Presentation Committee
Kuwait

PHONES
Azeezur Rahman
22444117 EXT. 110
Mujahid Khan Omeri
24711141 EXT. 104

FAX
22400057

E-MAIL
nelavanka@ipc-kw.com

WEBSITE
www.ipc-kw.com

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT




## ఈ సంచికలో....

ప్రజా జీవితాల నుండి ఏరి వేయాలి ........ 2
ఒక మేల్ కూర్పు..... ........ 3
ఖుర్ఆన్ అవతరించిన మాసం ........ 4
విద్యార్జనే పరిష్కారం ........ 6
భ్రూణ హత్యలు: ఇస్లాం ........ 8
ధర్మ సందేహాలు ........ 9
శుభాత్మల వైపునకు ........ 10
రమజాను మాసం: ఒక సమీక్ష ........ 12
యేసు శిలువపై మరణించారా? ........ 14
అహంకారం - దాని దుష్ఫలితాలు ........ 16


❖ ساء ما يعملون...! (كلمة العدد) ❖ رسالة إلي الوافد ❖ رمضان شهر القرآن ❖ طلب العلم هو الحل...
❖ الإسلام و وأد البنات ❖ الفتاوى الشرعية ❖ إلي الأرواح السعيدة ❖ نبذة عن رمضان
❖ ما هي حقيقة الصليب ❖ الكبر وأضراره



# ఈ రోగ కారకాలను ప్రజా జీవితాల నుండి ఏరివేయాలి

స్వలింగ సంపర్కాని (HOMO SEXUALITY)కి చట్టబద్ధతను కల్పిస్తూ ఇటీవల ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన సంచలనాత్మక తీర్పు నూరు కోట్ల మంది భారతీయులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఎందుకంటే అనాదిగా భారత దేశం ఆధ్యాత్మికతకు పుట్టినిల్లుగా పరిఢవిల్లింది. మన పూర్వీకులు విలువలకు కట్టుబడినవారు. మానమర్యాదలకు పట్టం కట్టినవారు. గాంధీజీ సహా భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన ప్రథమ శ్రేణి నాయకులుగానీ, రుషులుగానీ, పుణ్య పురుషులు గానీ స్వలింగ సంపర్కం లాంటి ముదనష్టపు చేష్టలకు స్వతంత్ర భారతంలో మాన్యత లభిస్తుందని కలలో కూడా ఊహించి ఉండరు. అటువంటి కర్మ భూమిలో నేడు గుండె తరుక్కుపోయే అనూహ్య సంఘటనలు సంభవించటం కడు శోచనీయం.

స్వలింగ సంపర్కం ఒక అసహజమైన, ప్రకృతికి విరుద్ధమైన చేష్ట. ఇది నీతి బాహ్యతకు పరాకాష్ఠ! జంతువులు సయితం ఆసక్తి కనబరచని ఈ పాడు పనికి ఒడిగట్టడం సృష్టిశ్రేష్ఠుడైన మానవుడికే చెల్లింది. సహజసిద్ధమైన లైంగిక వాంఛల పరిపూర్తికై ఒక మగవాడు ఒక ఆడదాన్ని ఆశించటం ప్రకృతి. అయితే ఈ ప్రకృతి కాస్తా వికటించి వికృతిగా మారి, దుష్ఫలితాలు చవి చూసిన దాఖలాలు చరిత్రలో ఉన్నాయి. పురుషుడు స్త్రీని కాదని, పురుషునితోనే రమించి, లైంగిక తృప్తి నొందే అసహజ చేష్టకు సహస్రాబ్దుల క్రితం శ్రీకారం చుట్టి, అపఖ్యాతిని మూటగట్టుకున్న తొట్టతొలి జనులు లూత్ జాతి జనులు. తన జాతివారిలో ప్రబలిన ఈ పాపిష్టి పోకడపై దైవప్రవక్త బాధతో కుమిలిపోయేవారు. కలత చెందిన మనసుతో, "అయ్యో! మీరు మరీ ఇంత లజ్జా విహీనులుగా ప్రవర్తిస్తున్నారేమిటి? మీ కోసం పరిశుద్ధలైన నా (జాతి) కూతుళ్ళుండగా, వారిని వదిలేసి మీరు మగవాళ్ళ వెంట పడ్డారేమిటి? మీరు కాస్త దైవానికి భయపడండి" అని లూత్ (అలైహిస్సలాం) తన జాతి ప్రజలను ప్రాధేయపడ్డారు. కాని ఆవేదనాభరితమైన ఆ పిలుపు వాళ్ల ముందు బధిర శంఖారావమే అయింది. ఎట్టకేలకు ప్రకృతి ప్రకోపించింది. దైవాగ్రహం వాళ్ళపై విరుచుకుపడింది. పశ్చిమాసియాలో మృత సముద్ర తీరాన నివసించే ఆ బస్తీ వాసులంతా భావితరాలకు ఒక గుణపాఠ సూచనగా మిగిలిపోయారు. నేడు శ్మశాన రాజ్యంగా మారివున్న ఆ జనవాసాల్లో ఒకటైన 'సదూమ్' పేరుతోనే (బహుశా) నేటి స్వలింగ సంపర్కులు 'సోడోమ్'లుగా వ్యవహరించబడుతున్నారు.



Dead Sea

పాశ్చాత్య దేశాలైన బ్రిటన్, అమెరికాలలో చాలా కాలంగా ఈ జాడ్యానికి చట్ట భద్రత ఉంది. ఆఖరికి అక్కడి చట్ట సభల్లో సయితం తమకు తగిన ప్రాతినిధ్యం ఉండాలని ఉద్యమించే దాకా పోయారు ఈ సోడోమ్‌లు. పాశ్చాత్యులను అనుకరించే మిగతా ప్రపంచంపై కూడా ఈ ప్రభావం పడింది. నేడు ప్రపంచంలో సగానికంటే ఎక్కువ రాజ్యాలే ఈ రంధ్యాతనాన్ని నేరంగా పరిగణించటం లేదంటే పరిస్థితి ఎంతగా విషమించిందో ఊహించవచ్చు. మన దేశంలో సయితం గత దశాబ్ది కాలంగా ఈ వెర్రిని ప్రమోట్ చేసే సినిమాలు నిర్మించబడ్డాయి. తమకు విచ్చలవిడిగా రమించే హక్కు ఇవ్వాలని మూడేండ్ల క్రితం ఈ జుట్టు పోలిగాళ్ళు ఢిల్లీ వీధుల్లో ప్రదర్శనలు జరిపిన వైనాన్ని మరువలేము. ఇప్పుడు ఆ 'గే'ల విజ్ఞప్తిపై ఏకంగా హైకోర్టు హోమో సెక్సువాలిటీని ప్రాథమిక హక్కుల కోవకు చెందిన అంశంగా ఖరారు చేసింది.

అబూ అతీఖ్

# ఒక మేల్ కూర్చి జనులకు చూపవోయ్!

**సోదర సోదరీమణులారా!**

ఇది ఆగస్టు నెల. భారతీయులమైన మనం ఏ దేశమేగినా, ఎందు కాలిడినా ఆగస్టు 15వ తేదీని మరువలేము. ఆ మాటకొస్తే ఏ జాతి ప్రజలకైనా "స్వాతంత్ర్య దినం" వెలకట్టలేనిది.

స్వదేశంలో ఉన్నప్పుడు స్వాతంత్ర్య దిన సంబరాలను తనివి తీరా ఆస్వాదించే వాళ్ళం. అయితే విదేశాలలో ఉన్నప్పటికిన్నీ, మనం మన పరిమితుల్లో ఉంటూ మన సభ్యతా సంస్కారాలను, మన దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేసే రీతిలో దేశభక్తిని చాటుకోవచ్చు.

ఈసారి పంద్రాగస్టు శనివారం నాడు వస్తోంది. శుక్రవారం ఎలాగూ సెలవు రోజు గనక అందరూ ఒక రోజు ముందు నుంచే సన్నాహాలు మొదలెట్ట వచ్చు. కువైట్‌లోని వివిధ రాష్ట్రాలకు చెందిన భారతీయ సంఘాలు ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని తమ తమ భాషా వర్గాలను, సముదాయాలను సమీకరించి, వారిలో భారత సంస్కృతీ సంప్రదాయాలను, ఆధ్యాత్మిక విలువలను, సంఘీంభావాన్ని నూరిపోయాలి. మినిస్ట్రీలలో పని చేసేవారికి ఎలాగూ శనివారం సెలవు దినం కాబట్టి, వారు ఆ రోజు ఉదయాన్నే భారత దౌత్య కార్యాలయానికి వెళ్ళాలి. భారత ప్రధాని జాతి ప్రజలకు ఇచ్చే సందేశాన్ని శ్రద్ధగా ఆలకించాలి.

**ఈ సందర్భంగా గమనార్హ విషయాలు:-**

- రాకపోకల సందర్భంగా భారత ఎంబసీ పరిసరాలలో సంస్కారవంతుల్లా మసలు కోవాలి. ఎక్కడా ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్త పడాలి.
- మిఠాయిలు, అల్పాహారాల పంపిణీ జరుగుతున్నప్పుడు అదే పనిగా ఎగ బడకుండా, తొక్కిసలాట జరగకుండా నిగ్రహం పాటించాలి.
- ఈ సంతోష ఘడియల్లో వ్యర్థ వ్యసనాలకు బానిసలవకుండా, అశ్లీల పరాచికాలకు, అసభ్యకర చేష్టలకు పాల్పడకుండా హుందాగా వ్యవహరించాలి.
- మద్యపానం, జూదం, మట్కా వడ్డీ లావాదేవీలు, అసహ్యకరమైన ప్రహేళికలు వంటివి ఈ ఉత్సవాలలో ఎక్కడా చోటు చేసుకోకుండా జాగ్రత్త పడాలి.

విదేశంలో మనం స్వాతంత్ర్య సంబరాలు జరుపుకుంటున్నప్పుడు "నిలుపరా నీ జాతి నిండు గౌరవం" అన్న రాయప్రోలు వారి సుభాషితాన్ని మరువరాదు.

దేశాభిమానం నాకు కద్దని
ఒట్టి గొప్పలు చెప్పుకోకోయ్!
పూని ఏదైనాను ఒక మేల్
కూర్చి జనులకు చూపవోయ్!

అన్న గురజాడ వారి హితోక్తి కూడా నేల నాలుగు చెరగులా విస్తరించివున్న మనకు అనుదినం అనుసరణీయమే!

ఈ తీర్పుపై సహజంగానే భారత దేశమంతటా వ్యతిరేకత వ్యక్తమయింది. దేశంలోని హిందూ, ముస్లిం, క్రైస్తవ సంస్థలే కాక సామాజిక, స్వచ్ఛంద సేవాసంస్థలవారు కూడా నిరసనలు తెలుపుతున్నారు. ఉపేక్షించదగ్గ గుప్పెడు మంది కోర్కెను తీర్చడానికి తరతరాల సంస్కృతీ సంప్రదాయాలను, విలువలను ఒక్క నాటితో, ఒక్క వ్రేటుతో అంతమొందించటం ఎంత వరకు సహేతుకం?

ఈ తీర్పును సవాలు చేస్తూ ఇప్పటికే సుప్రీం కోర్టులో పిటీషన్ దాఖలైంది. సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వానికి నోటీసు జారీ చేస్తూ, 'ఇంతకీ మీ ఉద్దేశ్యం ఏమిటి?' అని ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై రానున్న దినాలు ఆసక్తికరమైనవే. ఈ నీతిమాలిన చేష్టకు గనక చట్టబద్ధతను కల్పిస్తే భావిభారత సమాజానికి ఎన్నో ప్రమాదాలు పొంచి ఉంటాయి. ఇది ఎయిడ్స్ రోగానికి మూలకారకమని ఇప్పటికే తేలిపోయింది. అదీగాక ఈ ముదనష్టపు పోకడకు బానిసలైనవారు సామాజిక, సాంసారిక బరువు బాధ్యతల నుండి పలాయనం చిత్తగిస్తారు. సంతానోత్పత్తికి గొడ్డలి పెట్టుగా తయారవుతారు. చివరికి వైవాహిక వ్యవస్థను, వావివరసలను కూడా ప్రశ్నార్థకంగా చేసేసి కుటుంబ వ్యవస్థను కూల్చివేస్తారు. ఆఖరికి జాతుల, సముదాయాల రూపురేఖలే మారిపోయే దురవస్థ దాపురిస్తుంది. అందుకే ఈ దిక్కుమాలిన చేష్టను పెంచిపోషించేందుకు కుట్ర పన్నుతున్న జట్టు పోలిగాళ్ళను ప్రజా జీవితాల నుండి ఏరివేసేందుకు అందరూ కలిసి కట్టుగా ఉద్యమించాలి.



# దివ్య ఖుర్‌ఆన్ అవతరించిన మాసం


– రీమా నూర్ (జైలాని)

**'పవిత్ర ఖుర్‌ఆన్ అవతరించిన నెల రమజాన్. మానవులందరికీ (ఆ గ్రంథం) మార్గదర్శకం. రుజు మార్గం చూపే, సత్యాసత్యాలను వేరుపరచే స్పష్టమైన ఉపదేశాలు అందులో ఉన్నాయి. కనుక ఇక నుండి రమజాన్ నెలను పొందే వ్యక్తి ఆ నెల అంతా విధిగా ఉపవాసం ఉండాలి. .....అల్లాహ్ మీకు ప్రసాదించిన మహోపదేశానికి గాను మీరు అల్లాహ్ ఔన్నత్యాన్ని కొనియాడటానికీ, ఆయనకు మీరు కృతజ్ఞతలు తెలుపుకోవడానికి ఈ పద్ధతి తెలుపబడుతోంది'. (అల్ బఖరా: 185)**

పై ఆయతు భావాన్ని సంక్షిప్తంగా చెప్పాలంటే రమజాన్ నెలలో ఖుర్‌ఆన్ అవతరించింది కాబట్టి ఈ నెలను పొందిన ప్రతి వ్యక్తి కృతజ్ఞతా భావంతో ఉపవాసాలు ఉండాల్సిందేననీ, ఈ ఖుర్‌ఆన్ గ్రంథం సామాన్యమైనది కాదని, ఇది సర్వ మానవాళికై సకల సంక్షేమ సమృద్ధి పథకాలతో నిండిన ఉద్గ్రంథమని తెలుస్తుంది. మరైతే ఖుర్‌ఆన్ అంటే ఏమిటో, ఇది అవతరించిన ఆ మాసానికే అంత ప్రాధాన్యత ఎందుకివ్వ బడిందో తెలుసుకుందాం.

ఖుర్‌ఆన్ అనే పదం 'ఖిరాత్' నుండి వచ్చింది. ఖిరాత్ అంటే చదవడం అని అర్థం. ఖుర్‌ఆన్ అనగా పదే పదే చదవబడే పుస్తకం. దీని అర్థానికి తగ్గట్టు ఇది ప్రపంచ మంతటా అత్యధికంగా పఠించబడే గ్రంథమే గాక అత్యధికంగా కంఠస్థం చేయబడే ఏకైక గ్రంథరాజం కూడా.

ఈ ఉద్గ్రంథం సృష్టికర్త ద్వారా తన సృష్టికి ఇవ్వబడిన అమూల్య వరం. దీనిని ఫుర్‌ఖాన్, హుదా, రహ్మాహ్, బుష్రా, జిక్రా, అల్ కితాబ్ మరియు షిఫా అనే పేర్లు కూడా ఉన్నాయి. (విద్వాంసులు దీని గుణాలకనుగుణంగా దాదాపు నూరు పేర్లు సూచించారు). దీనిలో శుచీశుభ్రతల పాఠాలు, దైవారాధనల విధానాలు, ఆర్థిక వాణిజ్య వ్యవహారాలు, వివాహ విడాకుల నియమాలే కాక ఆది మానవుడైన ఆదం (అ.స) నుండి అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) వరకు వచ్చిన 1లక్షా 24 వేల మంది ప్రవక్తల్లోని 25 ప్రవక్తల జీవిత గాథలూ ఉన్నాయి. అహంకారంతో తిరస్కార వైఖరి నవలంబించి పుట్టగతులు లేకుండా రూపుమాపబడ్డ నూహ్, మూసా, ఆద్ మరియు సమూద్ జాతుల ఇతిహాసాలూ ఉన్నాయి. మనిషి వ్యక్తిగత జీవితం నుండి సామూహిక జీవితం వరకు కావలసిన సంవిధానమూ ఉంది. చట్ట విరుద్ధంగా ప్రవర్తించేవారిని దండించే న్యాయ శాసనమూ ఉంది. మనిషి మరణానంతర సాఫల్యానికి కావలసిన స్వర్ణ సూత్రాలూ ఉన్నాయి. ఇది, దీన్ని మనస్ఫూర్తిగా అనుసరించిన వారి శారీరక, మానసిక, ఆధ్యాత్మిక రోగాలను నయం చేసే ఒక వన మూలిక. మనిషిని మహా మనీషిగా మలిచే ఒక మహత్తర సాధనం.



ఖుర్‌ఆన్ న్యాయాన్యాయాలను, మంచీ చెడులను, సత్యాసత్యాలను తేల్చే విచక్షణా రేఖ (ఫుర్ఖాన్).

ధర్మ శాసనాలు తెలియక మంచీచెడుల మధ్య అయోమయ స్థితిలో సతమతమయ్యే మానవులకు రుజుమార్గం చూపించి గమ్యానికి చేర్చే మార్గదర్శి (హుదా).

మూఢ నమ్మకాల అంధకారాల్లో చిక్కుకుని వెలుగుకై పెనుగులాడే వారిని కాంతి వంతమైన బాట వైపు తరలింపజేసే ఒక ప్రకాశ జ్యోతి (నూర్).

పాపకార్యాలకు పాల్పడి నిరాశానిస్పృహలతో కృంగిపోయే జీవులకు క్షమా జ్యోతిని సూచించే కారుణ్య ప్రదాయిని (రహ్మాహ్).

మంచిననుసరించి, సత్కార్యాలు చేసే విశ్వాసులకు ఒక శుభవార్త (బుష్రా).

మంచిని వీడి, చెడుల ఊబిలో చిక్కుకున్న వారికి ఇదొక జ్ఞాపిక (జిక్రా).



ఆర్థిక, ఆధ్యాత్మిక, సామాజిక, మానసిక ఒత్తిడికి తట్టుకోలేక పతనాల అంచులకు చేరుకున్న వారికి ఇది ఒక దివ్య ఔషధం (షిఫా).

సకల విషయాల వివరణలు, ఎనలేని శుభాలు మేళ్ళతో కూడిన ఈ గ్రంథం ఎంత మహోన్నతమైనదంటే అల్లాహ్ ఈ మహోపదేశాన్ని ప్రసాదించినందుకు తన ఔన్నత్యాన్ని కొనియాడటానికి, కృతజ్ఞతలు తెలుపుకోవటానికి రమజాన్ మాసపు పూర్తి నెల ఉపవాసాలు తన దాసులపై విధిగా నియమించాడు.

కాస్త ఆలోచించండి! ఈ వరాన్ని పొందిన మనమంతా ఎంత భాగ్యవంతులమో! ఒకవేళ అల్లాహ్ మనకు ఈ ఖుర్‌ఆన్ గ్రంథాన్ని ప్రసాదించి ఉండకపోతే మనమెలాంటి అంధకారాల్లో ఉండేవారమో! ఎంత ఘోర విషయాలను ఎదుర్కొనే వాళ్ళమో! ఖుర్‌ఆన్ గ్రంథమే లేకపోతే మనం విగ్రహారాధన నుండి బయటపడలేక పోయేవారం. సారాయి, జూదం, మృత జంతువుల మాంసాహార భక్షణం, వ్యభిచారం లాంటి చెడుగులకు బానిసలయ్యే వారం.

ఇంకాస్త ఆలోచించండి, వడ్డీలు చక్ర వడ్డీల ఊబిలో చిక్కుకుని దివాలా తీసేవారము.


పంది మాంసానికలవడి టీనాసోలియమ్, స్వైన్‌ఫ్లూ లాంటి ఎపిడమిక్‌లకు గురయ్యే వారము. విశృంఖల జీవనానికి అలవడి ఎయిడ్స్ లాంటి ప్రాణాంతక రోగాలకు బలయ్యేవారము. మరైతే వీటన్నింటి నుండి దూరంగా ఆ మహోపదేశాన్ని ప్రసాదించిన ఆ అల్లాహ్‌కు ఎంతగా కృతజ్ఞులమై ఉండాలి? ఇంత చక్కటి జీవిత నియమావళి పట్ల మన వైఖరి ఎలా ఉండాలి? కాగా, ఖుర్‌ఆన్ పట్ల మన వైఖరి ఎలా ఉంది?

రమజాను మాసమొస్తుందంటే మన భక్తి విశ్వాసాలు పాల పొంగులా పైకొచ్చేస్తాయి. సాధ్యమైనంతవరకు శుభాల ప్రాప్తికై తాపత్రయ పడతాము, కానీ ఏ ఖుర్‌ఆన్ అయితే మన జీవితాలను తీర్చిదిద్దుతుందో, సరిచేస్తుందో, దానికి ఇవ్వవలసిన హక్కును ఇస్తున్నామా? పోట్లాటల్లో, వారసత్వ వాటాలు పంచుకునేటప్పుడు, ప్రమాణాలు చేయడానికి మాత్రం ఖుర్‌ఆన్ ఉపయోగిస్తాం లేదా కష్టాల్లో ఉన్నప్పుడు ఏదో ఒక ప్రత్యేక ఆయతును వంద నుండి లక్ష సార్లు చదవడం లాంటి పనులు చేస్తూ ఉంటాం. అదొక అపురూప దివ్య పుస్తకమని తలంచి అందమైన సంచుల్లో పెట్టి కళ్ళ కద్దుకుంటూ ఉంటాం. మహా అయితే రమజాను రాగానే అటక మీద పెట్టిన దుమ్ము పట్టిన పుస్తకాన్ని తీసి దానిపైనున్న ధూళిని తొలగించి ఒకసారి చదవడానికి ప్రయత్నిస్తాం. నిస్సందేహంగా ఖుర్‌ఆన్ పారాయణం ఆరాధన, ప్రవక్త ముహమ్మద్ (స) గారు దీని ఒక్కొక్క అక్షర పఠనానికి 10 పుణ్యాలున్నాయన్నారు. దీన్ని చదవడం తప్పనిసరి, కాని ఒక మాట గుర్తుంచుకోవాలి. అదేమంటే, ఇది అవతరింప జేయబడింది కేవలం చదవడానికి కాదు. దీని అనుసరణకు అవగాహన అవసరం, అవగాహనకు విచక్షణా వివేచన మవసరం. అప్పుడే దానిలోని ఆజ్ఞలను, కట్టుబాట్లను, విధులను అర్థం చేసుకుని అలవరచుకోవడానికి ప్రయత్నిస్తాం. అదీ కాక అర్థాన్ని తెలుసు కోకుండా కేవలం పఠించడం వల్ల దీని నుండి పొందవలసిన లబ్ధిని పొందలేము. మన మానసిక రోగాలూ పోవు, మన జీవితంలో రావలసిన మార్పూ రాదు. ఖుర్‌ఆన్‌ను కేవలం చదివే వారి ఉదాహరణ ఎటువంటిదంటే తలనొప్పో, కడుపు నొప్పోనని డాక్టరు వద్దకు వెళ్ళి అతడిచ్చిన మందుల చీటిని తెచ్చుకుని, పదే పదే మందుల చీటిని చదివితే రోగం నయమవుతుందనుకోవడం లాంటిది. రోగం నయమవ్వదు, నయమవ్వాలి అంటే ఆ మందులు తెచ్చి వాటిని సమయానికి వాడాలి, వైద్యుడు చెప్పిన పత్యం చేయాలి. అప్పుడే మనం ఆరోగ్యవంతులమవుతాము. అలాగే ఖుర్‌ఆన్‌ను కూడా పఠించాలి, అర్థం చేసుకోవాలి, దానిపై ఆలోచించాలి. మరి అనుసరించి ఆచరించాలి. అప్పుడే మనలో అల్లాహ్ కోరే పరివర్తన వస్తుంది.

> “మీ ఇండ్లను శ్మశానంగా మార్చకండి. సూరె బఖరా పఠించబడే ఇంటి నుండి షైతాను పారిపోతాడు”.
> -మహా ప్రవక్త ముహమ్మద్ (సఅసం)

> “ఇద్దరు వ్యక్తులపై తప్ప (వేరొకరిని చూసి) ఈర్ష్య చెందకూడదు. వారెవరంటే; 1) అల్లాహ్ ప్రసాదించిన ఖుర్‌ఆన్ విద్యను గ్రహించి అహోరాత్రులు దాని పరివ్యాప్తికై నిలబడినవాడు. 2) అల్లాహ్ ప్రసాదించిన ధనాన్ని రేయింబవళ్ళు దైవమార్గంలో ఖర్చు పెట్టడంలో నిమగ్నుడైనవాడు.”
> -మహనీయ ముహమ్మద్ (సఅసం)

# విద్యార్జనే పలు సమస్యలకు పరిష్కారం



(గత సంచిక తరువాయి భాగం)

అమ్జదలీ ఖాన్

**శే.గు: దీనికి పరిష్కార మార్గమేమిటి?**

జా.నా: భారత ప్రభుత్వానికి సంబంధించి నంతవరకూ నా భావన ఏమిటంటే, మన ఆధీనంలో ఉన్న వారి జీవితాలను తీర్చి దిద్దాల్సిన అవసరం ఉంది. మంచి విద్యను అందించడం ద్వారా వారి విశ్వాసాన్ని పొందాల్సి ఉంది. వారికి కావాల్సిన సౌకర్యాలను కల్పించి వారు భారతదేశంలోనే ఉండేందుకు ఇష్టపడేలా కృషి చేయాల్సిన బాధ్యత ఉంది. సంతోషంగా ఉన్నవారు కొద్దిమందే ఉన్నారు. వారికి మంచి విద్య అందించాల్సి ఉంది. పూర్వం పర్యాటక రంగం అనూహ్యంగా ఉండేది. స్విట్జర్‌లాండ్ వారు దాన్ని అభివృద్ధి పర్చారు. మనకు కాశ్మీర్ ఉంది. దీన్ని భూతల స్వర్గంగా పేర్కొంటారు. అయితే ఎందుకు మనం దాన్ని అభివృద్ధి పరచటం లేదు.

పర్యాటకంగా మంచి వసతులు కల్పించాలి. విద్యా ఉద్యోగ సౌకర్యాలు మొదలగునవి. కాశ్మీర్‌ను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే అక్కడికి వెళ్తున్నాము.

**శే.గు: కాశ్మీర్ అంశం రెండు చోట్లా ఓట్ బ్యాంక్ అంశం అయిపోయింది.**

జా.నా: అవును. వాస్తవంగా ఇదే అక్కడి నిజం.

**శే.గు: మీరు కాశ్మీరీలతో మాట్లాడినప్పుడు వారి నుండి మీరు ఏమి గమనించారు? వారికి అవకాశం ఇస్తే వారు దేన్ని కోరు కుంటారు?**

జా.నా: నేను గమనించింది ఏమిటంటే వారు తటస్థంగా ఉండేందుకే ఎక్కువ ఇష్ట పడుతున్నారు. ఇండియా–పాకిస్తాన్ రెండింటితో వారు విసుగు చెందారు.

**శే.గు: ఒకవేళ ఆ అవకాశం లభించకపోతే?**

జా.నా: అలాంటి పరిస్థితిలో భారత ప్రభుత్వం వారికి ఎక్కువ వసతులు కల్పించి వారి విశ్వాసాన్ని చూరగొనే ప్రయత్నం చేయాలి.

**శే.గు: వారి వద్దకు వెళ్ళాలా?**

జా.నా: అవును. ఖచ్చితంగా వారి వద్దకు వెళ్ళి వారి సమస్యలు పరిష్కరించాలి. వారికి విద్యను అందించాలి. అలా చేస్తే వారిని గెలవగలమని, సమస్యను పరిష్కరించు కోగలమనే విశ్వాసం నాకుంది.

**శే.గు: మీరు విద్య గురించి ప్రస్తావించారు. చాలా బాధాకరం. మీరు కూడా పాఠశాలలను, ముఖ్యంగా ఆంగ్ల పాఠ శాలలను నడుపుతున్నారని తెలుసు. మీ విద్యాభ్యాసం కూడా (ICSE) పద్ధతి ప్రకారమే జరిగిందనుకుంటాను?**

జా.నా: అవును. నిజమే.

**శే.గు: అందుకే మిమ్మల్ని వింతైన మౌలానాగా పేర్కొనవచ్చునేమో? ఎందుకంటే మీరు, ఆంగ్లంలో బోధన విద్య గురించి మాట్లాడుతారు. మీరు బాలికలను ఆధునిక పాఠశాలలకు పంపడాన్ని సమర్థిస్తారు. సానియా మీర్జాను సమర్థిస్తారు (నవ్వులు).**

జా.నా: (నవ్వులు) ఆమె చేసే మంచిని మాత్రమే నేను సమర్థిస్తాను. ఒకవేళ ఆమె తప్పు చేస్తే నేను వ్యతిరేకిస్తాను. ఇక నన్ను 'మౌలానా' అని పిలిచే విషయానికొస్తే ఈ పదం ఎక్కువగా భారత దేశంలోనే వాడ బడుతుంది. ఈ పదం ఒక పండితుడి కొరకో లేదా ఒక విద్వాంసుని కొరకో ఇక్కడ ఉపయోగిస్తారు. అయితే నన్ను ఒక పండితుడిగా ఎప్పుడూ భావించను. నన్ను ఒక విద్యార్థిగా, శిక్షకుడిగా మాత్రమే భావిస్తాను.

**శే.గు: ఆధునిక విద్య గురించి మీ దృక్పథం ఏమిటి?**

జా.నా: ఆధునిక విద్య గురించి ఖుర్‌ఆన్‌లో చెప్పబడింది. మొత్తం మానవాళికి, ముస్లింలకి మొట్టమొదట ఆజ్ఞాపించబడిన విషయం, ప్రార్థనో, దానమో, హజ్ యాత్రో కాదు, అది 'చదువు' గురించే. మొట్టమొదట దైవం పంపిన ఆదేశం 'చదువు' అనేదే. ప్రవక్త కూడా ప్రతి ముస్లిం స్త్రీపై, పురుషునిపై విద్యాభ్యాసం తప్పనిసరి అని వక్కాణించారు. కాబట్టి విద్యార్జన ప్రతి ముస్లిం స్త్రీ, పురుషుని కొరకు విధి.





**శే.గు: సచ్చార్ కమిటీ నివేదిక ప్రకారం ముస్లింలు వెనుకబడటానికి కారణం విద్యాలేమియే. కాగా; రెండవది వారు పూర్తిగా ఉర్దూ విద్యాభ్యాసం చేయడం, దీనివల్ల వారికి ఉన్నత ఉద్యోగావకాశాలు సన్నగిల్లాయని తెలుస్తోంది...**

జా.నా: అదీ నిజమే. సచ్చార్ నివేదికకు సంబంధించి ముస్లింలు 59.1 శాతం ఉంటే హిందువులు 65.1 శాతం. అంతరం కేవలం 6 శాతమే.

గమనార్హ విషయం ఏమిటంటే పాఠశాలల్లోనే సమస్యలు ఉన్నాయి. భారతీయ విద్యా వ్యవస్థలో గ్యాడుయేషన్‌కు వెళ్ళినప్పుడు ఇంకా పెద్ద సమస్యలే ఉన్నాయి. జస్టిస్ సచ్చార్ గారు ప్రభుత్వం సౌకర్యాలను సమకూర్చడం లేదని పేర్కొన్నారు. ప్రముఖ కాలేజీలను చూస్తే అందులో ముస్లింలు కేవలం 4శాతం, పి.జీల్లో 2శాతం, ఐఐఎమ్‌లో 1.3 శాతం, ఐఐటీలో 3.3 శాతం మాత్రమే ఉన్నారని ఆయన చెప్పారు. ఈ తారతమ్యం ఎందుకని ఆయన ప్రశ్నిస్తున్నారు. మనం ముస్లింల కొరకు మరిన్ని వసతులను కల్పించాలని కోరారు. దీంతో నేనూ ఏకీభవిస్తున్నాను.

**శే.గు: ఉర్దూ మీడియం విద్య గురించి మీ అభిప్రాయం ఏమిటి?**

జా.నా: ఉర్దూ మీడియంకు నేను వ్యతిరేకిని కాను. అదే సమయంలో మనం ఈ రోజు అంతర్జాతీయ భాష అయిన ఇంగ్లీష్ ప్రాముఖ్యాన్ని గుర్తించాలి. ఇక వ్యక్తిగతంగా నేనైతే అరబీ మరియు ఇంగ్లీష్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాను.

**శే.గు: సరే, సరే.**

జా.నా: ఆ తర్వాతే ఉర్దూ. నేను ఉర్దూకు వ్యతిరేకిని కాను. ఉదాహరణకు: చూడండి, 8వ శతాబ్దం నుండి 12వ శతాబ్దం వరకూ గల కాలాన్ని యూరోపియన్లు చీకటి యుగంగా అభివర్ణించారు. కాని సరిగ్గా ఆ కాలంలోనే వైజ్ఞానిక సాంకేతిక రంగాల్లో, గణిత శాస్త్రంలో ముస్లింలు అద్భుతాలు చేశారు.

**శే.గు: మిలిటరీ క్రాఫ్ట్‌తో సహా...**

జా.నా: కాబట్టి వాళ్ళు సైన్సు గురించి తెలుసుకోవాలన్నప్పుడు వారికి అరబీ నేర్చుకోవాల్సి ఉండేది. ప్రస్తుతం ఆంగ్ల భాష ప్రపంచ స్థాయి భాష కావటం వల్ల నేను గుర్తించినవి ఏమిటంటే – ఒకటి; ఇంగ్లీష్, రెండవది; అరబీ భాష. అరబీ దైవ వాక్యాలను అర్థం చేసుకునేందుకై తోడ్పడు తుంది. అందుకే నేను వ్యక్తిగతంగా ఉర్దూకు కాకుండా అరబీ మరియు ఇంగ్లీష్‌లకే ప్రాధాన్యత ఇస్తాను.

**శే.గు: మీ వద్ద అత్యంత ప్రాచుర్యం పొందిన పీస్ టీ.వీ ఛానల్ ఉంది....ఇంకా మీరు న్యూస్ ఛానల్ గురించి కూడా మాట్లాడు తున్నారు. అది ఎప్పుడు ప్రారంభమవు తుంది?**

జా.నా: వాటి ప్రణాళికలు ఇప్పటికే సిద్ధమైనాయి. ప్రస్తుతానికి దైవ కృప వల్ల జూన్ నెలలో పీస్ టీ.వి ఉర్దూ ఛానల్ ప్రారంభమవుతోంది. ప్రస్తుతం నడుస్తున్నది మిశ్రమ ఛానల్. అందులో ఉర్దూ 25 శాతం ప్రత్యేకంగా ముస్లిమేతరుల కొరకు 75 శాతం, ఇంగ్లీష్ కార్యక్రమాలు ఉన్నాయి. ఈ ఛానల్‌ను నూటికి నూరు శాతం ఇంగ్లీష్ ఛానల్‌గా మార్చి, ఉర్దూ కొరకు కూడా నూరు శాతం ఇదే జూన్ నెలలో (కొత్త ఛానల్) ఇన్షాఅల్లాహ్ ప్రారంభిస్తున్నాము. ఈ పరంపరలో తర్వాత వచ్చేది న్యూస్ ఛానల్. దాని కోసం ఏడాదిగాని, రెండు మూడేండ్లు గానీ పట్టవచ్చు.

**శే.గు: దాని కోసం ఎదురు చూస్తున్నాము. మీరు చేస్తున్న వాటిలో....**

జా.నా: నేను ఎన్.డి టీవికి పోటీగా లేను (నవ్వుతూ).

**శే.గు: (నవ్వుతూ) అలా అని కాదు. మనం ప్రేక్షక లోకాన్ని మరింత ఇంప్రూవ్ చేయాలి... వివిధ మతాల గురించి, వివిధ మత పెద్దలతో మీరు నిర్వహిస్తున్న చర్చా కార్యక్రమాలు విదితమే. ప్రపంచం సంస్కృతీ నాగరికతల గురించి, సముదాయాల గురించి మాట్లాడుతున్న ప్రస్తుత తరుణంలో వీటిని మీరు బాగా అస్వాదిస్తున్నారను కుంటా.**

జా.నా: అలాంటివి చాలా తక్కువగానే జరిగాయి.

**శే.గు: పోపు, మీ ప్రతిపాదనను అంగీక రించలేదు...**

జా.నా: విదేశాల్లో ఒకసారి అమెరికా వెళ్ళినప్పుడు అక్కడి క్రిస్టియన్ మిషనరి వారు ముద్రించిన 'ఖుర్‌ఆన్ లో 30 తప్పులు' అనే పుస్తకం చూశాను. చికాగోలో 'బైబిల్ ఖుర్‌ఆన్ – సైన్సు దృష్టిలో' అనే అంశంపై నేను జరిపిన చర్చల్లో ఒకటి. ఇక మన దేశంలో శాటిలైట్ ఛానల్ పీస్ టీ.వి ప్రారంభోత్సవ సందర్భంగా శ్రీ శ్రీ రవి శంకర్ గారితో జరిగిన చర్చ ముఖ్యమైనది.

**శే.గు: అందులో మీ ఇద్దరిదీ చాలా రమ్యమైన సంభాషణ.**

జా.నా: ఆ చర్చ యొక్క ప్రధాన అంశం 'ఇస్లాం మరియు హిందూయిజంలలో దైవభావన-దివ్య గ్రంథాల దృష్టిలో'. ఇందులో మేము దైవం గురించి పవిత్ర గ్రంథాల్లో పేర్కొనబడిన వాటినే ప్రస్తావించాలి. ఇస్లాం మరియు హిందూ ధర్మాలలో దైవభావన ఒక్కటే అన్నది నా ప్రధాన ఉద్దేశం. విగ్రహారాధన చేయరాదని, దైవం ఒక్కడే పూజకు అర్హుడని తెలుపడం చర్చనీయాంశం. నేనెల్లప్పుడూ పండితులు చెప్పేదాన్ని పేర్కొనడం కన్నా గ్రంథాలలో పొందుపరచబడి ఉన్న వాటినే నమ్ముతాను.

(ఇంకా ఉంది)

# భ్రూణ హత్యలు - ఇస్లాం



ముహమ్మద్ బిలాల్



అదొక అనాగరిక యుగం. క్రూరత్వానికి మరో రూపం. ఆడపిల్లలు పుడితే అవమాన భారంతో కృంగిపోయేవారు. వీధిలో తలెత్తుకు తిరగడానికి సిగ్గు పడేవారు. వంశానికే అవమానమని తలపోసేవారు. తన బిడ్డ ఇతరుల దగ్గర సంసారం చేయాల్సి వస్తుందని, ప్రతి చిన్న విషయానికి వియ్యంకులవారికి అణగి ఉండాల్సి వస్తుందని తలపోసేవారు. పుట్టినప్పటి నుంచి పెండ్లి చేసేవరకు సాకితే చివరికి అత్తగారింటికి వెళ్ళిపోతుందే గాని తల్లిదండ్రులకు ఎలాంటి ప్రయోజనం లేదని, పెట్టిన పెట్టుబడి వృధా అవుతుందని అనుకునేవారు. ఆడబిడ్డ పుట్టుకను ఒక భారంగా భావించేవారు. అందుకే పుట్టిన వెంటనే చంపేసేవారు. లేక ప్రాణంతోనే పూడ్చి పెట్టేవారు.

సుమారు 14 వందల సంవత్సరాల క్రితం సర్వలోకాల ప్రభువు "పేదరికానికి భయపడి మీరు మీ సంతానాన్ని హత్య చెయ్యకండి. మేము వారికీ ఉపాధిని ఇస్తాము, మీకూ ఇస్తాము. వాస్తవానికి వారిని హత్య చెయ్యడం ఒక పెద్ద నేరం" (బనీ ఇస్రాయీల్: 31) అని తెలియజేశాడు.
ప్రవక్త (స) గారు ఈ నికృష్టపు పనిని సమూలంగా తుడిచివేశారు. ఈ అనాగరికపు చేష్టను దూరం చేసి స్త్రీ అంతస్తును పెంచారు. తల్లిదండ్రుల ఆస్తిలో ఆమెకు హక్కును కల్పించారు. తల్లి పాదాల క్రింద స్వర్గం ఉందని, తల్లి గొప్పతనం తండ్రి కన్నా మిన్న అని బోధించారు. ఇంకా ఆడబిడ్డ పుట్టుక తల్లిదండ్రుల పాలిట వరమని, వారిని పెంచి పెద్ద చేసి, సంస్కారాలు నేర్పి, పెండ్లిళ్ళు చేస్తే స్వర్గానికి వెళ్ళడానికి మార్గమవుతారని తెలిపారు. ఆడబిడ్డలు మగ బిడ్డల కన్నా తక్కువేమీ కాదని, దైవం దృష్టిలో అందరూ సమానమని తెలిపారు.

ఖైస్ బిన్ ఆసిమ్ (ర.జి) అనే సహాబీ అజ్ఞాన కాలంలో తన ఆడ బిడ్డను సజీవంగా పూడ్చి పెట్టిన విధానాన్ని విని ప్రవక్త (స) గారు దుఃఖంతో విలపించారు. కన్నీటితో ఆయన గడ్డం తడిసిపోయింది. పరలోకంలో అల్లాహ్ ఈ చేష్ట గురించి అడుగుతాడు. ఆ రోజున మనం ఏమి సమాధానం ఇవ్వగలమో ఆలోచించండి. ఎందుకంటే అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో ఇలా తెలియజేస్తున్నాడు: "సజీవంగా పాతి పెట్టబడిన బాలికను 'తను ఏ తప్పుపై హత్య చేయబడింది?' అని అడగబడినప్పుడు".

(అత్ తక్వీర్: 8,9)

సమాజాన్ని శాసిస్తున్న మేధావి వర్గం కూడా ఈ దురాచారానికి ఒడిగట్టుతున్నది. హైటెక్కుల రాజ్యం, ఇంటర్‌నెట్‌ల కాలంలో జీవిస్తున్నా ఈ భ్రూణ హత్యలు మాత్రం ఆగడం లేదుకదా ఇంకా పెరిగిపోతున్నాయి. పుట్టుకకు నోచుకోకుండానే ఒక్క సూది పోటుతో ముక్కలు ముక్కలుగా చేసి వేస్తున్నారు. ఆడబిడ్డ ప్రాణాలు వదిలే ముందు అమ్మా, నాన్నా నేనేమి పాపం చేశాను, నన్ను ఘోరంగా చంపడానికి మీకు చేతులెలా ఆడుతున్నాయి? అనే ఆ పిలుపు అరణ్య రోదనే తప్ప హైటెక్కు జీవితానికి అలవాటు పడిన ఈ తల్లి దండ్రులకు వినిపించదాయె. ప్రాణాలు పోయవలసిన డాక్టర్లు డబ్బుకు ఆశ పడి ప్రాణాలు సులభంగా తీయగలమని నిరూపించు కొంటున్నారు.
అజ్ఞాన కాలంలో ఆ విధంగా చంపారంటే సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన ఈ కాలంలో వినూత్న పద్ధతిలో ఈ హత్యలకు పాల్పడు తున్నారు. ఒక అడుగు ముందుకెళ్ళి పుట్టక ముందే ఆడపిల్లల గొంతు పిసికేస్తున్నారు. ఆడపిల్లల హత్యలు ఇలాగే కొనసాగితే కొంత కాలానికి జనాభా నిష్పత్తిలో అసమ తౌల్యం ఏర్పడి సమాజంలో మరో రకమైన ఘోరాలు జరగడం మొదలవుతాయి.

రండి! మనం నడుం బిగించి ప్రవక్త ముహమ్మద్ (స) గారు స్థాపించిన సుందర సమాజాన్ని తిరిగి నిర్మించడం కోసం పాటు పడుదాం! అందులోనే మానవ శ్రేయం, శుభం ఉందని చాటి చెబుదాం!

# మస్జిద్‌లో బిగ్గరగా ఖుర్‌ఆన్ పారాయణం

**ప్రశ్న :- మస్జిద్‌లలో సాటి సోదరులు నఫిల్ నమాజు చేసుకుంటు న్నప్పుడు బిగ్గరగా ఖుర్‌ఆన్ పఠించటం సమ్మతమేనా?**

జవాబు :- మస్జిద్ లోపల బిగ్గరగా ఖుర్‌ఆన్ పారాయణం చేయటం వలన చుట్టు ప్రక్కల నమాజు చేసుకునేవారికి అంతరాయం కలుగు తుంటే అలా చేయడం భావ్యం కాదు. మస్జిద్ అనే కాదు, మరే చోటైనా సరే ఖుర్‌ఆన్ పఠనం వల్ల తన ప్రక్క నమాజు చేసేవారికి ఇబ్బంది కలుగుతుందనుకుంటే ఖుర్‌ఆన్ పఠిత నెమ్మదిగా పఠించాలి. దైవప్రవక్త (సఅసం) ఒకానొక సందర్భంలో మస్జిద్‌లోనికి విచ్చేసినపుడు కొంత మంది నమాజులో నిమగ్నులై ఉన్నారు. మరి కొంతమందేమో బిగ్గరగా ఖుర్‌ఆన్ పఠిస్తున్నారు. అప్పుడాయన (సఅసం) ఇలా అన్నారు: "మీలోని ప్రతి ఒక్కరూ అల్లాహ్‌తో సంభాషించటంలో నిమగ్నులై ఉన్నారు. అయితే ఒకరింకొకరికి అసౌకర్యం కల్పించకండి". **– షేఖ్ బిన్ బాజ్ (రహ్మ.లై)**

## మిగిలిన భోజన పదార్థాలను చెత్త కుప్పలపై పారవేయటం గురించి

**ప్రశ్న :- కొంత మంది మిగిలిపోయిన భోజన పదార్థాలను సంచుల్లో, తట్టల్లో పెట్టి రోడ్లపై పారబోస్తున్నారు. పశువులు తింటాయన్న ఉద్దేశంతో వారు అలా చేసి ఉండవచ్చు. కాని మున్సిపాలిటీ వారు ఆ భోజన పదార్థాలను చెత్తకుండీల ద్వారా తరలిస్తున్నారు. ఈ విధంగా భోజన పదార్థాలను చెత్త కుప్పల్లో వేయటం సమ్మతమేనా?**

జవాబు:- మనం తినగా మిగిలిపోయిన భోజన పదార్థాలను నిరుపేదలకు, అవసరార్థులకు పెట్టాలి. ఒకవేళ తినేవారు దొరక్కపోతే, ఆ పదార్థాలను ఉత్తమ రీతిలో బహిరంగ స్థలాల్లో ఉంచాలి. అక్కడ సంచరించే జంతువులు, పశువులు వాటిని తింటాయి. ఇలా చేయడానికి కూడా వీలు పడనప్పుడు ఆ మిగులు ఆహార వస్తువులను తట్టల్లోగానీ, కార్టూన్లలోగాని వేసి బల్దియా వారికి అప్పగించాలి. బల్దియా వారు తమ సిబ్బంది చేత అలాంటి ఆహార పదార్థాలను అవసరమనుకున్న చోట చేరవేయాలి. ఎందుకంటే మనం తినే భోజన వస్తువుల పట్ల అమర్యాద ఎంతకీ తగదు.

–షేఖ్ బిన్ బాజ్ (రహ్మ.లై)

## ప్రవక్త (స)పై, కన్న బిడ్డలపై ఒట్టేసి చెప్పటం

**ప్రశ్న:- కొంత మంది మహా ప్రవక్త (సఅసం)పై, తమ కన్నబిడ్డలపై పదే పదే ప్రమాణం చేసి చెబుతుంటారు. అలా చేయటం వెనుక వారి అంతర్యం 'షిర్క్' ఎంత మాత్రం అయి ఉండదు. కాకపోతే అది వారికి (ఊత పదంగా) అలవాటు అయిపోయింది. అలాంటివారు దైవ సమక్షంలో ప్రశ్నించబడతారా?**

జవాబు :- మహా ప్రవక్త (సఅసం) వారిపైగానీ, వేరొకరిపైగానీ ఒట్టేసి చెప్పటం ధర్మసమ్మతం కాదు. పైగా ఇది అధర్మం, షిర్క్‌తో కూడుకున్నది. ఎందుకంటే "ప్రమాణం చేయదలచిన వారెవరయినా సరే అల్లాహ్‌పై ప్రమాణం చేయాలి. లేదంటే ఊరుకోవాలి" అని ప్రవక్త (స) వారే స్వయంగా తాకీదు చేశారు (బుఖారీ, ముస్లిం).

"దైవేతరుని పేర ప్రమాణం చేసినవాడు అవిశ్వాసానికి ఒడిగట్టాడు. లేదా షిర్క్‌కు పాల్పడ్డాడ"ని కూడా ఆయన (స) నిర్దిష్టంగా ప్రవచించారు (అబూ దావూద్, తిర్మిజీ).

ఈ నేపథ్యంలో ఇమామ్ ఇబ్నె అబ్దుల్ బర్ (రహ్మ.లై) క్రోడీకరించిన విద్వాంసుల ఉమ్మడి అభిప్రాయం గమనించదగినది. అదేమంటే; "దైవేతరులపై ఒట్టేసి చెప్పటం సమ్మతం కానే కాదు. అందువల్ల ముస్లిమైనవాడు దేవుని మేళ్ళను ఆశిస్తూ, ఆయన ఆగ్రహానికి భయపడుతూ ఉండాలి. దైవేతరులపై ప్రమాణం చేసే చేష్టకు దూరంగా ఉండాలి. గతంలో ఎప్పుడన్నా అలాంటి పని చేసివుంటే పశ్చాత్తాప పడాలి. ఇక మీదట సత్య విషయానికి కట్టుబడి ఉండాలి".

## తారా బలాన్ని నమ్మటం


**ప్రశ్న:- ఆకాశంలో ఒకానొక చుక్క కనిపిస్తే "ఇక వర్షం పడుతుందిలె" అని పల్లె ప్రజలు అంటుంటారు. ఇలా అనవచ్చా?**

జవాబు:- ఇలా చెప్పటంగానీ, ఈ రకమయిన నమ్మకం కలిగి ఉండటం గానీ ధర్మసమ్మతం కాదు. అసలిదొక నిరాధారమైన విషయం, మూఢ నమ్మకం. ఎందుకంటే మహాప్రవక్త (సఅసం) ప్రవచనం ప్రకారం అల్లాహ్ ఇలా అన్నాడు: "వర్షం కురిసే సమయంలో, ఈ వర్షం అల్లాహ్ కృపతో కురుస్తుందని చెప్పినవాడు నాపై విశ్వాసముంచాడు, తారా బలాన్ని తిరస్కరించాడు. ఇక ఫలానా ఫలానా నక్షత్రం మూలంగా వర్షం కురిసిందని చెప్పినవాడు అవిశ్వాసి అవుతాడు. ఎందుకంటే అతను నక్షత్రాలను నమ్ముకున్నాడు". (బుఖారీ, ముస్లిం)

ముస్లింలోని ఒక హదీసు ప్రకారం మహాప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు: "నా అనుచర సమాజంలో అజ్ఞాన కాలానికి చెందిన నాలుగు ఆచారాలున్నాయి. వాటిని అది వదలు కోవటం లేదు – ఒకటి: తమ వంశపరంపరపై గర్వపడటం. రెండు: ఇతర వంశాలపై బురద జల్లటం. మూడు: వర్షం కొరకు నక్షత్రాలను నమ్ముకోవటం. నాలుగు: మృతునిపై పెడబొబ్బలు పెడుతూ రోదించటం. ఇలా పెడ బొబ్బలు పెట్టే స్త్రీలు తమ మరణానికి ముందే పశ్చాత్తాపం చెందితే సరి. లేకపోతే, ప్రళయదినాన కడు విచిత్రంగా నిలబెట్టబడతారు. వారి శరీరాలపై గంధకపు వస్త్రాలుంటాయి. దురద పొక్కులుంటాయి".

# సత్యాన్ని స్వాగతించిన శుభాత్మల వైపునకు





సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ

**అది ఎత్తయిన పర్వతంపై గల సౌర్ గుహ.**

అందులో ఇద్దరు ప్రాణ మిత్రులు. ప్రాణం తీయడం కోసం గాలిస్తున్న శత్రుసైన్యం నుండి రక్షణకై దాగివున్నారు. అక్కడ అలా ఆ గుహలో బిక్కుబిక్కుమంటూ మూడు రోజులు గడిపారు. 'కలత చెందకు, ఆందోళన పడకు, దైవం మనకు తోడుగా ఉన్నాడు' అన్న అప్తుని అభయం అందినప్పటికీ - ఎప్పుడు, ఏ క్షణం ఏం జరుగుతుందోనన్న ఆందోళన అధికమవుతూనే ఉంది. సాలీడు గుహపై గూడు అల్లినా, పావురం ఓ ప్రక్క గ్రుడ్లు పెట్టినా, ఇది దైవం ఏర్పాటు చేసిన సౌకర్యం అని తెలుస్తున్నా మదిలో కలవరం మాత్రం కలుగుతూనే ఉంది. చివరకు దేవుడా అంటూ గండం గడిచింది. అది నాల్గవ రోజు - కొండ అవతల దూరాన మూడు ఒంటెలు నిల్చొని ఉన్నాయి.

**ముహమ్మద్ (స)** - ఆయన పేరుకు తగ్గట్టు ప్రజలచే మన్ననలు అందుకున్న మహా మనీషి. దైవంచే నియమించబడిన ప్రవక్తలందరి లోని అంతిమ ప్రవక్త. అందరికీ ప్రియతముడు. నాటి నుండి నేటి వరకు అలాంటి అత్యుత్తమ గుణసంపత్తి గల అమీన్‌ను, సాదిఖ్‌ను కాలం చూడలేదు. చూడబోదు కూడా. అంతటి పరిపూర్ణుడు, సత్య సంధుడు, ఆదర్శప్రాయుడు అంతిమ ప్రవక్త (స). ఆయనతో పాటు ఆయన ప్రతి మాటను సత్యం అని సాక్ష్యమిచ్చిన సిద్దీఖ్ కూడా ఉన్నారు. తాము జన్మించిన పుణ్యభూమిని వదలి దూరంగా కొత్త ప్రాంతం - యస్రిబ్‌కు తీసుకెళ్ళేందుకే ఆ ఒంటెల తోటి ఓ నమ్మకస్తుడు అక్కడ వేచివున్నాడు.

మదిలో ఏదో తొలిచివేస్తున్న కలత. ఆత్మను నిగ్రహించుకొని చేతులెత్తి ప్రార్థించారు ప్రవక్తశ్రీ (స). ఆ పర్వతం దిగుతుండగా ఆయన్ను దుఃఖం ఆవహించింది. ఆయన మథన పడుతున్నారు. పైకి తను ప్రశాంతంగా ఉన్నప్పటికీ హృదయ వేదనపు అలల ఘోష హోరుమంటోంది. బోరున విలపిస్తోంది.

దుఃఖ పడకుండా, శాంతంగా నేనెట్లా వెళ్లగలను? హృదయంలో ఒక్క గాయమైనా లేకుండా, కళ్ళ నుండి ఒక్క కన్నీటి బొట్టైనా కార్చకుండా నేనీ నగరాన్ని వదలి, దూరంగా కదలి ఎలా వెళ్ళగలను? అసంభవం-అయినా తప్పదు!

ఈ పుర పరిసరాల్లో దివ్యకాంతులతో అలరారే ఎన్నో పగటి వేళల్ని, ఏకాంతంగా ఏకేశ్వరోపాసనలో లీనమైన ఎన్నో రాత్రుల్ని గడిపాను. వారాలు నెలల తరబడి ఏకాంతంలో ఉదయం సాయంత్రాలు సమాజ శ్రేయం కోసం, ప్రజల సంక్షేమం కోసం ఆలోచించింది ఈ హిరా గుహలోనే కదా! దైవదూత దివి నుండి భువికి దిగివచ్చి దివ్యవాణిని అందజేసి, 'చదువు, చదువు' అని పదే పదే పురమాయించింది ఈ నూర్ పర్వతంపైనే కదా!! అసలు భూవాసులకంతా మార్గదర్శక కేంద్రం కదా ఈ నగరం! నగరంలోని 'కాబా' గృహం!! ప్రవక్తల పితామహులు 'హజ్ కోసం సమస్త మానవాళికి పిలుపునిచ్చింది ఈ పుర పర్వతాల పైనుండే కదా!!! నేను నా బాల మిత్రులతో గొర్రెలు మేపుతూ ఆడుకున్నది ఈ మైదానాల్లోనే కదా! అటువంటి బృహత్తర నగరాన్ని బాధపడకుండా, దుఃఖం కలుగకుండా ఎవరు మాత్రం దూరం కాగలరు?

ఈ నగర వీధుల్లో నా బాల్య స్మృతులెన్నో అంతర్లీనమై ఉన్నాయి. ఈ పుర గల్లీల్లో నా యౌవనపు 'అమీన్ - సాదిఖ్'ల మల్లెలు గుభాళిస్తున్నాయి. ఈ పర్వత శిఖరాల మధ్యవున్న పేటల్లో నా రక్తపు బొట్లెన్నో కార్చబడివున్నాయి. ఇక్కడి ప్రతి రేణువు నాపై జరిపిన దౌర్జన్యాలకు సజీవ సాక్ష్యమై ఉంది. ఏ బాధా, భారం లేకుండా నేను వాటి నుండి ఎలా దూరం కాగలను?

నా వెనక శాశ్వతంగానైనా, తాత్కాలికంగానైనా విడిచిపోవడానికి ఇవి కేవలం స్మృతులు కావు. సత్యకాంతులు పరిపూర్ణం కాబోతున్న పవిత్ర పుడమి ఇది. లోక కళ్యాణానికై శాంతి సందేశాన్ని అందించబోయే పుణ్య క్షేత్రం ఇది. అయినా వెళ్ళక తప్పదు. సమస్త లోకాల సంరక్షకుడైన ఆ సర్వోన్నతుడి ఆదేశం నన్ను పిలుస్తోంది. నేను ఒంటె ఎక్కి వెళ్ళిపోవాలి. అందరినీ వదలి ఒంటరిగానే సాగిపోవాలి. ఇక్కడ ఉన్నవాటన్నింటిని - తల్లి ప్రేమ, పిన్ని ప్రేమ, పిల్లల ప్రేమ, అప్తుల ప్రేమ, అనాథల ప్రేమ - అంతా నా వెంట తీసుకెళ్ళాలని ఉంది. కానీ...

మహా ప్రవక్త (స) పర్వత పాదానికి చేరి మరోసారి మక్కా వైపు తిరిగి తదేకంగా చూశారు. ఓ నా పుర ప్రజలారా! నేను బయలుదేరడానికి సిద్ధంగా ఉన్నాను. ఇన్నాళ్ళు, ఇన్నేళ్ళు మీలో ఒకడిగా ఉన్న నన్ను వేధించి, వేధించి మీ నుండి వేరు చేసి దూరంగా పంపించేస్తున్నారు. నా పట్ల మీ ఈ వైఖరికి ఎంతో చింతిస్తున్నాను. ఇలా నేను వెళ్ళడం మీలోని అనేక మందికే కాక, ఆకాశానికి నిచ్చెన వేస్తున్న ఈ పర్వత శిఖరాలకు, సస్యశ్యామలంగా అలరారుతున్న ఆ తాయిఫ్ వనాలకు సైతం ఇష్టం లేనట్టుంది. మీతోపాటు అవన్నీ మౌనం దాల్చిన మూర్తులై ఉన్నాయి. ఇంతగా స్తంభించివున్న ఈ వాతావరణంలో నేను మరోసారి శ్వాస పీల్చుకోవాలని ఉంది. ఇక్కడి సుగంధ పరిమళాల్ని మరొక్కసారి తనివితీరా ఆస్వాదించాలని ఉంది. మక్కా నగరంలో మక్కా వాసులతో కలసి ఇంకొక్కసారి ప్రశాంతంగా జీవించాలని ఉంది. అందుకే మక్కా వైపు, మక్కా వాసులైన మీ వైపు మమకారంతో మరొక్కసారి తిరిగి చూస్తాను. కాదు, కాదు - నేను మళ్ళీ ఈ



పురానికి తిరిగి వచ్చేంత వరకు చూస్తూనే ఉంటాను. విశ్వాసుల దిశగా 'కాబా'ను చేయమని ఆకాశం వైపు చూస్తాను. ఆహ్! మక్కా నగరమా!! నీవు నాకు ఎంతో ప్రియమైనదానవు. నీ వారు నన్ను వెలివేయకుంటే ఎన్నటికీ నేను నిన్ను విడిచిపోయేవాడ్ని కాను. ఓ పర్వత శిఖరాల్లారా! ఓ చెట్టూపుట్టల్లారా! ఓ వాగువంకల్లారా! అందరికీ, మీ అందరికీ తుది వీడ్కోలు చెబుతున్నాను. అల్ విదా! అల్ విదా!! అల్ విదా!!!

మహా ప్రవక్త (స) వారి ఆవేదనాభరిత మౌన స్వరం విన్న పర్వతాలు, లోయలు, తోటలు, కాయలు, పుష్పాలు ఒక్కసారిగా చెప్పనారంభించాయి - ప్రవక్తా! ఇప్పుడే మమ్మల్ని వదలి వెళ్ళకండి. మీరు మా మధ్య గడిపిన సంవత్సరాలు, మరువలేని మధుర స్మృతులుగా మారిపోయాయి. మీరు మా మధ్య ఉత్తమంగా, అత్యుత్తమంగా మసిలారు. అందుకు మేమే ప్రత్యక్ష సాక్ష్యం! మీ పాద స్పర్శలతో మా జన్మ ధన్యమయ్యింది. మీ ధ్యాన ప్రార్థనలతో మేము తేజోవంతమయ్యాము. మీ మూలంగా దివ్యకాంతులు మాపై ప్రసరించాయి. మేము మిమ్మల్ని ఎంతగానో ప్రేమించాము. కానీ ఏం లాభం...? మా కీర్తనలు, ప్రేమామృతాలు దైవం తలిస్తే తప్ప మానవులు వినలేరు.

ప్రవక్తా! సఫా కొండపై నిలబడి మీరు ఇచ్చిన సత్య సందేశాన్ని మొదట శిరసావహించింది మేమే. మీ ప్రబోధనల్ని తిరస్కరించి విసిరిన రాళ్ళను, కారిన రక్తాన్ని చూసి మొదట కన్నీళ్ళు పెట్టుకున్నదీ మేమే. తాయిఫ్ వీధుల్లో అలగాజనుల అఘాయిత్యాలకు గురైనప్పుడు మీ పరిశుద్ధ దేహం నుండి కారే పవిత్ర రక్తాన్ని మోయలేక, చూసి తాళలేక కృంగి, కృశించిందీ మొదట మేమే. పర్వత దూతను మీరు అడ్డుకున్నారే గాని, ఆ ఆనకట్టే గనక లేకపోయుంటే- ఈ తాయిఫ్ పట్టణమే ప్రపంచ పటం నుంచి తొలగించబడి ఉండేది.

ఆహ్! ఈ మనుషులు - మూర్తీభవించిన మానవత్వాన్ని గ్రహించని మూర్ఖులు!! మా జాతినే (రాళ్ళు, ఇటుకలు) మిమ్మల్ని కొట్టేందుకు ఆయుధాలుగా వాడుకుంటున్నారు!!! 'దైవం శిక్షిస్తాడన్నా' - మీరు వారిని కనికరించి వదిలేసారే - ఎంతటి కరుణ గలవారు మీరు! దైవ దూత 'నాశనం చేస్తాను' అని పూనుకొని ఉంటే, వారిపై ఎనలేని ప్రేమను కురిపించి రక్షించారే - ఎంత గొప్ప ప్రేమ మూర్తులు మీరు!! జిబ్రయీల్ 'అనుమతివ్వండి' అని బతిమిలాడుతుంటే, జాలి, దయ, కరుణ ప్రేమలకు పరాకాష్ఠగా నిలిచారే తమరు - ఎంతటి జాలి గుండె మీది!!! ఆహ్! ఈ తాయిఫ్ ప్రజలు మిమ్మల్ని గుర్తించలేని స్థితిలో పడి కొట్టుమిట్టాడుతున్నారు. సాక్షాత్తు సత్యమే వచ్చి పలుకరిస్తున్నా స్వీకరించలేకపోతున్నారే!! ప్రవక్తా! మీ దేహం నుండి కారిన ప్రతి రక్తపు బొట్టును ప్రళయం వరకు కాపాడుతాము. ఆ స్థలాల్నీ కాపాడుతాము. ఆ స్థల ప్రజల్నీ అంధవిశ్వాసాల ఊబి నుండి రక్షించమని ప్రభువు సన్నిధిలో ప్రాధేయపడతాము. ఇదే మా శపథం! ఇందుకు మీరే సాక్షులు!! ఇన్ని రోజులకు ఇప్పుడు మా అందరి ప్రేమ తనను తాను వ్యక్తపరచుకోవాలని ఉవ్విళ్ళూరుతూ మీ ముందు వినయంగా నిలబడి విలపిస్తున్నది. వియోగ సమయం వరకు ప్రేమకు సైతం తన మహత్తు తెలియదు. ఆహ్! ఈ ప్రేమ... ఎప్పుడూ ఇంతే!! నాటి నుండి నేటి వరకూ!!!

ప్రియ ప్రవక్తా! దైవాదేశం వచ్చేసింది. ఇక మీరు వెళ్ళక తప్పదు. మీ స్మృతులకు నిలయమై, మీ సంప్రదాయాలకు ఆలయాలమై అనతి కాలంలోనే మిమ్మల్ని మళ్ళీ కలుసుకుంటామన్న పూర్తి నమ్మకం మాకుంది. మా ప్రేమ మిమ్మల్ని బంధించదు. మా అవసరాలు మిమ్మల్ని ఆపుచేయవు. కానీ, మీరు మమ్మల్ని వదలివెళ్ళే ముందు మాదొక మనవి - మీరు అందజేసిన సత్యసూక్తులన్నింటినీ మేము భద్రంగా దాచుకుంటాము. మనుషులే కాదు మృగాలు సైతం వాటికి కట్టుబడి ఉండేలా చెయ్యమని ఆ సర్వోన్నతుడ్ని వేడుకుంటాము. మా పుర ప్రముఖులు, ప్రజలు , అందరూ ప్రపంచ ప్రజలందరి వద్దకు మీ సత్య సందేశం అందాలని ఆ పరమ ప్రభువునే ప్రార్థిస్తాము. ఆ 'సత్యం' ఎన్నటికీ నాశనం కాదు. ఆ ప్రసక్తే రాదు.

మహా ప్రవక్త (స) తల ఎత్తి అన్నింటి వంక చూశారు. అనిర్వచనీయమైన ప్రశాంతత వాటి నుదుళ్ళపై వర్షిస్తోంది. గంభీర స్వరంతో, బాధ నిండిన గొంతుతో, బరువెక్కిన గుండెతో, 'అల్ విదా' అన్నాయి. అశ్రుపూరిత నేత్రాలతో మదీనా వైపునకు బయలుదేరారు మహనీయ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం.

ఇది నిశ్చయంగా సత్యజ్యోతి వెలిగే సమయం. సత్యప్రభాకరుడు ఉదయించే ఘడియ. సత్యకాంతుల్ని ప్రకాశింపజేసే తరుణం. ధర్మం పరిపూర్ణం గావించబడే శుభ సందర్భం. సత్యకేతనం ఎగురవేసే శుభ ఘడియ. ఆ శాంత స్వరూపుడే సత్యజ్యోతిని వెలిగిస్తాడు. అసత్య సునామీలు ఎదురయినా, అధర్మ పవనాలు వీచినా, అన్యాయ వరదలు వచ్చినా, అక్రమ అలలు పైకెగసినా సత్యాన్ని వెలిగిస్తాడు. అందులో నూనె పోసి - ఆ వెలుగుల్ని నేల నాలుగు చెరగులా వ్యాపింపజేస్తాడు. అవును - సత్యం గెలుస్తుంది. వెలుగుతూనే ఉంటుంది. ధర్మం జయిస్తుంది. విజేతగా నిలుస్తూనే ఉంటుంది. అవును - సత్యం, ధర్మమే వెలిగేది. అసలు గెలిచేది. దైవగ్రంథం ఇచ్చే సాక్ష్యం కూడా ఇదే.

**ఈ విధంగా ప్రకటించు: "సత్యం వచ్చేసింది. అసత్యం సమసిపోయింది. నిశ్చయంగా అసత్యం సమసిపోవలసిందే".**

# రమజాన్ మాసం - ఒక సమీక్ష



అబ్దుల్ హాఖ్
(పోరుమామిళ్ళ)

**రమజాన్ మాసం ముఖ్యంగా – ఆత్మ ప్రక్షాళన మాసం. ఆధ్యాత్మికతను పునరంకితం చేసే మాసం. వ్యక్తి జీవన విధానంలో చైతన్యాన్ని ప్రేరేపించే మాసం.**

క్రమ శిక్షణను నేర్పి, దైవానికి అంకితం అయ్యేటట్లు చేసే మాసం. దైవ ప్రసన్నతను తనివి తీరా గ్రోలే మాసం. దైవ కరుణా కటాక్షాలను పొందే మాసం. విశ్వమానవ సౌభ్రాతృత్వానికి అద్దం పట్టే మాసం. పరస్పర ఆత్మీయతాభావాల్ని అనుసంధా నించే మాసం. ఒకే కార్యానికి పది నుండి ఏడు వందల రెట్లు పుణ్యఫలాలను అందించే మాసం. స్వర్గ ద్వారాలు తెరువబడి, నరక ద్వారాలు మూసివేయబడే మాసం. దైవంపై గల విశ్వాసాన్ని పటిష్టపరచుకునే మాసం. పవిత్ర ఖుర్ఆన్ అవతరించిన మాసం. దాని బోధనామృతాన్ని ప్రజలకు అందజేసే మాసం. ధనికులు, స్థితిపరులు నిరుపేదలకు దానధర్మాలు అందజేసే మాసం. భక్తులతో మస్జిదులన్నీ నిండే మాసం. ముస్లింల విశ్వాస పరిమళాలు వెదజల్లే మాసం. ఆద్యంతం అపార దైవానుగ్రహాలు వర్షించే మాసం. పుణ్యకార్యాల పట్ల ఆకాంక్ష, పాపకార్యాల పట్ల వైముఖ్యం కలుగజేసే మాసం. ధనవంతులకు పేదల హక్కును గుర్తింపజేసి జకాత్, ఫిత్రా వంటి ధర్మాలను నిర్వర్తింపజేసే మాసం. నిరుపేదల ఆకలి దప్పులను ధనికులకు అనుభవపూర్వకంగా రోజా ద్వారా తెలియజేసే మాసం. అదే రమజాను మాసం.

### ఈ మాసపు ప్రాముఖ్యం

దివ్య ఖుర్ఆన్‌లో ఈ మాసం గురించి ఇలా వివరించబడింది: "పవిత్ర ఖుర్ఆన్ అవతరించిన నెల రమజాన్ నెల. మానవు లందరికీ (ఆ గ్రంథం) మార్గదర్శకం. రుజుమార్గం చూపే, సత్యాసత్యాలను వేరు పరిచే స్పష్టమైన ఉపదేశాలు అందులో ఉన్నాయి. కాబట్టి ఇకపై రమజాన్ నెలవంకను ఎవరు చూస్తారో, వారు నెల అంతా విధిగా ఉపవాసం పాటించాలి".

(2: 185)

ప్రవక్త (స) మహనీయులు ప్రారంభంలో కేవలం ప్రతి నెలలో మూడు రోజులు మాత్రమే రోజా (ఉపవాసం) పాటించాలని బోధించారు. కాని ఆ రోజాలు ఫర్జ్‌గా (విధిగా) నియమించినవి కావు. ఆ తర్వాత హిజ్రీ 2వ సంవత్సరంలో రమజాన్ రోజాలు పాటించే ఈ ఆదేశం దివ్యఖుర్ఆన్‌లో అవతరించింది. బద్ర్ యుద్ధానికి ముందు రమజాను రోజాల విషయంలో అవతరించిన తొలి ఆదేశం.

మరో చోట మహా ప్రవక్త (స) ఆదేశించినట్లు అబూ హురైరా (ర) ఉల్లేఖనం: "మీపై ఒక శుభప్రదమైన నెల అవతరించనున్నది. దాని ఉపవాసాలు మీపై విధిగా చేయబడ్డాయి. ఈ నెలలో స్వర్గ ద్వారాలు తెరచివేయబడతాయి. నరక ద్వారాలు మూసివేయబడతాయి. షైతాన్‌లు బంధింపబడతారు. వేయి నెలలకంటే శ్రేష్ఠమైన రేయి ఒకటి ఈ నెలలోనే ఉంది. ఎవరైతే దాని శుభాలను కోల్పోయారో వారు వాస్తవానికి ఎంతో దౌర్భాగ్యులు".

స్వర్గానికి ఎనిమిది ద్వారాలున్నాయి. వాటిలో ఒక ద్వారం కేవలం ఉపవాసి కొరకే కేటాయింపబడింది అని శుభవార్త ఇవ్వ బడింది.

యంత్రాలు ఎడతెరపి లేకుండా కొంత కాలం పని చేసిన తర్వాత వాటి భాగాలను ఊడదీసి శుభ్రం చేయాలి.దాన్నే ఓవరాయి లింగ్ అంటారు. ఓవరాయిలింగ్ చేసే టప్పుడు ఆ యంత్రం భాగాలన్నింటినీ బాగా శుభ్రం చేయించీ, యథావిధిగా పని చేసేందుకు సిద్ధపడే విధంగా తయారు చేస్తారు. మలినాలన్నీ పోయి పరిశుభ్రంగా యంత్రం తయారై తన విధి నిర్వహణకు సిద్ధమౌతుంది. తరిగిపోయినట్టి శక్తిని రీచార్జ్ చేసినట్లుగా యంత్రం పూర్వపు స్థితికి వస్తుంది. అలాగే ఈ మాసం కూడా జీర్ణ వ్యవస్థకు విశ్రాంతినిచ్చి దానికి క్రమ బద్ధతను చేకూరుస్తుంది. ఇలా క్రమ బద్ధతను చేకూర్చే ఆరాధనయే రోజా (ఉపవాసం).

### తన కోసం మాత్రమే

అల్లాహ్ సమస్త జీవరాసుల కోసం సంవత్సరంలో పదకొండు నెలలు కేటాయించి, ఈ ఒక్క రమజాను మాసాన్ని తన కోసం పెట్టుకున్నాడు. ఆరాధనల్లో అత్యధిక భాగం ఈ నెలలో నిర్వహించవలసి ఉంటుంది. ఏతికాఫ్ పాటించడం జరుగు తుంది. జకాత్, ఫిత్రా, సద్ఖా వంటి దానాలు చేయడం, దివ్యఖుర్ఆన్ ఆద్యంతం పారాయణం చేయడం ఈ మాసం ప్రత్యేకతలు.

ఇంకా ఈ మాసంలోనే ఇబ్రాహీమ్ ప్రవక్తకు సహీఫాలు, మూసా ప్రవక్తకు తౌరాత్ గ్రంథం, దావూద్ ప్రవక్తకు జబూర్ గ్రంథం, ఈసా ప్రవక్తకు (ఏసు క్రీస్తు) ఇన్జీల్ (సువార్త) గ్రంథం ప్రసాదించబడింది.

అల్లాహ్ మనలను సృష్టించాడు. మనం శారీరకంగానూ, మానసికంగానూ బలహీనులం. అందువలన ఆ బలహీన తలను ఈ మాసంలో ఓవరాయిలింగ్ చేయింకునేందుకు కేటాయించాడు. ఈ మాసంలో ప్రపంచ వ్యాప్తంగా బాలురు మొదలుకుని వృద్ధుల వరకు భక్తులచే మస్జిద్‌లు కళకళలాడుతుంటాయి. దాన ధర్మాలకు సంబంధించిన కార్యాలు ముమ్మర మవుతాయి. సోదరభావం పరస్పరం బల పడుతుంది. ఎక్కడ చూచినా శాంతి సౌహార్దాల వాతావరణమే కానవస్తూ ఉంటుంది. మానసిక శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం అనేకమైన ఇతర లాభాలు కూడా రోజా వలన లభిస్తాయి. ఈ మాసంలో మహనీయ ప్రవక్త (స) ఎంతో హుషారుగా, ఎంతో ఆనందంగా గడిపేవారు.

# సీరత్ క్విజ్



షేఖ్ హబీబుర్రహ్మాన్ జామయి

**ప్రశ్న: దైవ ప్రవక్త (స) ఇచ్చిన సందేశాన్ని ఖురైషులు ఎందుకు వ్యతిరేకించారు?**

జ: దైవ ప్రవక్త (స) వారిని ఒకే ఒక దేవుడైన అల్లాహ్‌నే ఆరాధించాలనీ, వారు పూజించే విగ్రహాలు దేవుళ్ళు కారనీ, మరణించిన తర్వాత అల్లాహ్ వద్ద అందరూ హాజరు కావలసియున్నదనీ, పాపపుణ్యముల ఫలితములను అక్కడ అనుభవించవలసి ఉందని చెప్పిన కారణాన ఖురైషులు వ్యతిరేకించారు.

**ప్రశ్న: దైవ ప్రవక్త (స) పిలుపును అపుటకై వారు చేసిన మొదటి పని ఏది?**

జ: ఖురైషులు అబూ తాలిబ్ వద్దకు వచ్చి, "ఓ అబూ తాలిబ్ ! మీరు మర్యాదస్తులు. మేము ఇదివరకే మీ సోదర కుమారుణ్ణి నిలువరించమని నచ్చజెప్పాము. కాని మీరు అలా చేయలేదు. మా ఆరాధ్య దైవాల్ని కించపరచడాన్ని మేము ఇక భరించలేం. మీరే గనక అతన్ని అడ్డుకోకపోతే మీతోను, అతనితోను పోరు తప్పదు.

**ప్రశ్న: ఖురైషుల మాటలు విన్న అబూ తాలిబ్ ఏమి చేశారు?**

జ: అబూ తాలిబ్ వారి కోపాన్ని కడు సౌమ్యంగా శాంత పర్చడానికి ప్రయత్నించారు.

**ప్రశ్న: మక్కా ముష్రికులు అబూ తాలిబ్‌ను రెండవసారి కలసినప్పుడు ఏమన్నారు?**

జ: దైవ ప్రవక్త యొక్క కార్యకలాపాలను ఆపమని కోరారు. ఒకవేళ అలా జరగని పక్షంలో, తామే తమ దండోపాయంతో దైవ ప్రవక్త (స) కార్యకలాపాలను ఆపుతామన్నారు.

**ప్రశ్న: ఖురైషుల హెచ్చరికను విన్న అబూ తాలిబ్ దైవ ప్రవక్త (స)తో ఏమన్నారు?**

జ: అబూ తాలిబ్ దైవ ప్రవక్త (స)ను పిలిపించి కురైషుల ఉద్దేశాన్ని తెలియపర్చారు. అదే కాక ఇకముందు తమ శక్తికి మించిన బరువు బాధ్యతలను తనపై వేయకూడదని కూడా ప్రాధేయపడ్డారు.

**ప్రశ్న: దైవ ప్రవక్త (స) దానికి ఇచ్చిన సమాధానం ఏమిటి?**

జ: బాబాయి! దైవసాక్షి! వీరు నా కుడి చేతిలో సూర్యుణ్ణి, ఎడమ చేతిలో చంద్రుణ్ణి తెచ్చి పెట్టినా నేనీ కార్యాన్ని దాని హద్దు వరకు తీసుకొని వెళ్ళకుండా ఆగలేను. అల్లాహ్ తన శిక్షనైనా అవతరింప జెయ్యాలి లేదా ఈ మార్గంలో నేనైనా నామరూపాల్లేకుండా పోవాలి. అప్పటి వరకు ఈ సందేశ ప్రచారాన్ని ఆపేది లేదు" అని నిక్కచ్చిగా చెప్పి అశ్రునయనాలతో వెళ్ళిపోతుండగా అబూ తాలిబ్ ఆయన్ను పిలిచి ఇలా అన్నారు: "కుమారా! నీకిష్టమైనట్లే కానివ్వు. దైవసాక్షి! నేను నిన్ను ఎన్నటికీ విడిచి పెట్టను".

శాంతి ప్రియ

# భారతీయులం మనమందరం

ఆదం అడుగు పెట్టిన చోట
రక్తం ఏరులై పారుతోందిరా
అహింస ప్రతిధ్వనించిన చోట
హింసా ప్రవృత్తి ప్రబలుతోందిరా

మమతల మందారాలు పూచిన చోట
మారణ హోమం రగులుతోందిరా
గాంధి మహాత్ముడు పుట్టిన చోట
గాడ్సే రాజ్యం సాగుతోందిరా

ఒకనాటి మన పుణ్య భూమి
మరు భూమిగా మారుతోందిరా
కాళనాగుల కరాళ నృత్యం
కర్మ భూమిని కాటువేస్తుందిరా

పైశాచిక దాడులతో, సాతాను చేష్టలతో
రాజ్యం అస్థిపంజరాలకు ఆలయమౌతోందిరా
కొంపలు కూల్చే , మంచిని సమాధి చేసే
ముష్కరులతో తమస్సు తాండవిస్తోందిరా

చరిత్రకందని కాలం నుంచి
భారతీయులం మనమందరం
ఒకటిగా నడచి ఒకటిగా నిలిచి
విష వృక్షాలను పెకిలిద్దాం
శాంతి సామరస్యాలు స్థాపిద్దాం
నవ సమాజాన్ని నెలకొల్పుదాం

# మర్యమ్ కుమారుడగు యేసు శిలువపై మరణించారా? -2



ఏసు గారి కోసం ఉపయోగించిన వస్తువుల్ని పరిశీలించండి-

1) నార బట్ట - CLEAN LINEN CLOTH

2) అగరు - MYRRH

3) బోళము- ALOE

4) సుగంధ ద్రవ్యములు- SPICES

5) పరిమళ లేపనములు - OINTMENTS

ఇక వీటి అర్థాల్ని "ENGLISH OXFORD DICTIONARY" నుండి తెలుసుకుందాం.

1)LINEN: లినెన్ అంటే ఫ్లాక్స్ అనే ధాతువు నుండి తయారు కాబడిన బట్టలు. ఫ్లాక్స్ అంటే - నూనె గింజల కొరకు పెంచబడు ఊదా రంగు పువ్వులతో కాయు మొక్కలు. అంటే అవిసి నారతో చేయబడిన బట్టలు. (ఎస్తేరు 8:15 గమనించండి).

2)MYRRH: అతుకు గుణము గల జిగురు. దీనిని పరిమళాలు - మందులు అగరు తయారీలో ఉపయోగిస్తారు.

3)ALOE: ALOEVER అనేది వాడుకలో ఉన్న మాట. యాలోవిరా అనేది కాస్మిటిక్స్ తయారీలో ఉపయోగిస్తారు.

4)SPICES: ఘాటుగా ఉండి మసాజ్ (మర్దన)లో ఉపయోగించు కంద మూల పదార్థము. వాడుకలో ఉన్న మాట (AROMATHERAPY) 'ఎరోమా థెరపి'.

5)OINTMENTS: మెత్తగా, బంకగా ఉండి స్వస్థత కొరకుగాని, చర్మాన్ని తిరిగి మామూలు స్థితికి తెచ్చు పదార్థాల తయారీలో ఉపయోగిస్తారు.

COSMETIC అంటే అందాన్ని సమకూర్చేది. లోతుగా కాని గాయాలను మాన్పి, చర్మాన్ని తన నిజ స్థితిలో కనబడునట్లు చేయటానికి ఉపయోగించు పదార్థములు.

పైన పేర్కొనబడిన వస్తువులు నాడుగానీ, నేడుగానీ, ఇకమీదటగానీ అవి యాంటీ బయోటిక్స్‌గా మాత్రమే ఉపయోగ పడగలవు. ANTIBIOTICS అనేవి సజీవులకు మాత్రమే కాని మృత్యువులకు కాదు అని గ్రహించగలరు.

## మృత్యుంజయుడైతే భయం దేనికో?

యేసు నిజంగా చనిపోయి పునరుత్థానుడైతే ఆయనను ఎవరూ ఏమీ చేయలేరు. అయితే యూదులకు భయపడి, ఆ పరిసర ప్రాంతాలలో ఉన్నన్ని రోజులు మారు వేషంలోనే ఎందుకున్నారు? కేవలం తన శిష్యులే ఉన్నారు, ఇంకెవరూ లేరని నిర్ధారణకు వచ్చిన పిదపే తన అసలు రూపమును కనబర్చేవారు. అందరి ముందు ప్రత్యక్షమవ్వ లేదు. "ఆమె ఈ మాట చెప్పి వెనుక తట్టు తిరిగి, యేసు నిలిచియుండుట చూచెను గానీ, ఆయన యేసు అని గుర్తు పట్టలేదు. యేసు - అమ్మా ఎందుకు ఏడ్చుచున్నావు ఎవరిని వెదుకుచున్నావు? అని ఆమెను అడుగగా, ఆమె ఆయన తోటమాలి అనుకొని - అయ్యా నీవు ఆయనను మోసుకొని పోయిన ఎడల ఆయనను ఎక్కడ ఉంచితివో నాతో చెప్పుము, నేను ఆయనను ఎత్తుకొని పోదునని చెప్పెను. యేసు ఆమెను చూచి - మరియ అని పిలిచెను. ఆమె ఆయన వైపు తిరిగి ఆయనను హెబ్రీ భాషలో రబ్బూనీ అని పిలిచెను". (యోహాను20:14-16)

### ముఖ్యాంశాలు

అ) మగ్దలేనె మరియ యేసును చూసింది. కాని గుర్తుపట్టలేకపోయింది.

ఆ) యేసును తోటమాలి అనుకున్నది.

వారిద్దరు తప్ప మరెవ్వరూ లేరని నిర్ధారణ అయిన పిదప ఆయన తన సహజ సిద్ధమైన స్వరంతో 'మరియా' అని పిలవగానే ఆమె ఆయన్ను గుర్తు పట్టింది. అంటే యేసు తన స్వరంతోపాటు స్వరూపం కూడా మార్చుకుని ప్రజలకు తెలియకుండా జాగ్రత్త పడేవారు.

## చూడండి!

1) సూర్యోదయమగుచుండగా యేసు దరిని నిలిచెను, అయితే ఆయన ఏసు అని శిష్యులు గుర్తు పట్ట లేదు.

(యోహాను 21:4)

అంటే – శిష్యులు సైతం గుర్తుపట్టలేనంతగా తన వేషాన్ని మార్చుకుని ఉండేవారని తెలుస్తుంది.

2) ఆ తర్వాత దారిలో ఇద్దరు ఒక పల్లెటూరికి నడిచిపోవుచుండగా ఆయన మారు రూపము గలవాడై వారికి ప్రత్యక్ష మాయెను.

అలా యేసు మారు రూపాలతో ఎందుకు ఉండేవారంటే – తాను జీవించి ఉన్నానని తెలిస్తే యూదులు మరలా ఏ అఘాయి త్యానికయినా ఒడిగట్టవచ్చు. అలా కాదు అంటే – తాను నిజంగా మృత్యుంజయుడై పునరుత్థానుడై ఉంటే మారు వేషాలతో, మారు స్వరంతో తిరగాల్సిన అవసరం ఏమొచ్చింది? ఏ విధంగానైతే, ముందు – పట్టబడక పూర్వం మారు వేషాలలో ఉండేవారో, అలానే ఇప్పుడు కూడా మారు వేషంతో తిరుగుతున్నారంటే – ఆయనకు శిలువ మీద మరణం సంభవించలేదనే చెప్పాలి. శిలువ మరణమే లేనప్పుడు ఇక క్రైస్తవం ఎక్కడిది? ఆలోచించండి!

## చివరి మాట

జీవితం కడు విచిత్రమైనది. ఎన్నో మలుపులు, మరెన్నో సంఘటనలతో మనిషి జీవితాన్ని నిర్దేశిస్తూ, నడిపిస్తూ ఉంటాయి. అయితే మేలు తొందరగా జరగాలన్న మానవ బలహీనతను ఆసరాగా చేసుకుని స్వార్థపరులైన కొందరు, దైవంతో దైవ గ్రంథాలతో సంబంధం లేని వెర్రి పోకడలతో ఆధ్యాత్మిక జీవితాన్ని విచిత్రమైన, వికృతమైన రూపంలో ప్రజలకు పరిచయం చేశారు. తమ జీవితాల్ని ఆధ్యాత్మిక రంగం నుండి వేరు పర్చుకున్న ప్రజల్లో సైతం పరిశీలన, ప్రశ్నించే, తర్కించే స్వభావం అంతరించి అంధానుసరణ ప్రారంభమయింది. అలా గుడ్డి నమ్మకాలకు అలవాటు పడిన సామాన్య ప్రజలు తాము తరతరాలుగా అనుసరిస్తున్న మార్గభ్రష్టత్వమే నిజమార్గం అని తలపోస్తున్నారు. ఎవర్ని ఎలా గౌరవించాలో, నిజదైవంగా ఎవరిని కొలవాలో తెలియక తికమక పడుతున్నారు.

ప్రజల మనోభావాలు దోలాయమానంగా ఉన్నప్పుడు, వాస్తవాలను సమాధి చేయాల్సిందేనా? అసత్యాలు సత్యాలుగా చెలామణి అవుతుంటే నిజం గొంతు నొక్కేయాల్సిందేనా? ప్రజలు అజ్ఞానం వల్ల మార్గం తప్పి ప్రవర్తిస్తుంటే చూస్తూ ఊరు కోవాల్సిందేనా? వారు నరకాగ్నికి చేరువవుతుంటే చేతులు ముడుచుకుని కూర్చోవాల్సిందేనా? నిజమిదని తెలిసాక, వాస్తవమేమిటో స్పష్టమయ్యాక కూడా నిర్లిప్తంగా ఉండాల్సిందేనా? ఇది అత్యంత దారుణమైన విషయం కాదా? సాటి ప్రజల్ని కాపాడాల్సిన బాధ్యత మన మీద లేదా? నిజం నిగ్గు తేలినప్పుడు దాన్ని బహిర్గతపరచి ప్రజల్ని మూఢ విశ్వాసాల నుండి రక్షించాల్సిన బాధ్యత జ్ఞానుల మీద లేదా? నిజాన్ని నిజం అని చెప్పినంత మాత్రాన ప్రజలు మారిపోతారా? తాతముత్తాతల కాలం నుండి పాటిస్తూ వస్తున్న ఆచారాలను వదులుకుంటారా? అని అడగవచ్చు. దానికి సమాధానం ఖుర్‌ఆన్ చెబుతుంది: **"కావున నీవు హితోపదేశం చేస్తూ ఉండు. వాస్తవానికి నీవు కేవలం హితోపదేశం చేసేవాడవు మాత్రమే. నీవు వారిని (విశ్వసించమని) బలవంతం చేసేవాడవు కావు".**

(గాషియా: 21,22)

**"ఓ (ప్రవక్తా!) వారిని సన్మార్గాన్ని అవలం బించేటట్లు చేయటం నీ బాధ్యత కాదు. కానీ, అల్లాహ్ తాను కోరిన వారికి సన్మార్గం చూపుతాడు". (బఖరహ్: 272)**

మరలాంటప్పుడు ప్రజలకు మనం సత్యోపదేశం ఎందుకు చేయాలి? నరకానికి ఆహుతి అవ్వడానికి ఇష్టపడుతున్నవారిని మనం ఎందుకు స్వర్గం వైపు ఆహ్వానించాలి? అంటారా...!! వినండి. నిజ దైవ దాసులు ఏమంటున్నారో...!!!

"వారిలోని ఒక వర్గంవారు (సత్యప్రియుల్ని విమర్శిస్తూ) 'అల్లాహ్ ఎవరిని నశింపజేయనున్నాడో లేదా ఎవరికి కఠిన శిక్ష విధించనున్నాడో అలాంటివారికి మీరెందుకు హితోపదేశం చేస్తున్నారు?" అని అన్నప్పుడు వారు (సత్యోపదేశం చేసేవారు) అన్నారు: **"మీ ప్రభువు ముందు, (హితబోధ ఎందుకు చేయలేదన్న) నింద మా మీద ఉండకూడదని, మరియు బహుశా వారు (మా హితోపదేశంతో) దైవభీతిపరులు, ధర్మ పరాయణులు అవుతారేమోనని".**

(ఆరాఫ్: 164)

సత్యప్రియులు తమలోని సత్యార్తిని తీర్చుకునేందుకు సత్యాన్వేషణ జరిపి సత్యాన్ని చేరుకుంటారని ఆశిస్తూ...!



షేఖ్ సలీమ్ జామయి

# అహంకారం : దాని దుష్ఫలితాలు

ముందుగా 'అహంకారం' అని దేనిని అంటారో తెలుసుకుందాం... మహనీయ ముహమ్మద్ (స) అహంకారం గురించి వివరిస్తూ "సత్యాన్ని తిరస్కరించటం, సాటి మానవులను అల్పుల క్రింద జమ కట్టడమే అహంకారం" అన్నారు.

అహంకారం కొందరిలో అసూయ వల్ల పుడితే మరికొందరిలో అధికారం, బలం వల్ల పుడుతుంది. లేదా జనంలో వారికి గల పలుకుబడి వల్ల పుడుతుంది. అలాగే ఎదుటి మనిషిని చిన్న చూపు చూసి ఇష్టానుసారం మాట్లాడటానికి అలవాటు పడ్డవారిలో కూడా అహంకారం ఉంటుంది.

వాస్తవానికి మానవుడు జీవరాసులలో ఉత్తముడయి ఉండి కూడా అతడు అహంకారానికి అర్హుడు కాడు. అనర్హుడయి కూడా ఎవరైనా అహంకారం ప్రదర్శిస్తే, అలాంటి వారిపై దేవుడు ఆగ్రహిస్తాడు. అహంకారానికి అలవాటు పడ్డవారిని దేవుడు ఎంత మాత్రం ఇష్టపడడు. సత్యాన్ని తిరస్కరించే అహంకారులను దేవుడు ఇహలోకంలోనూ పరలోకంలోనూ శిక్షిస్తాడు. అహంకారం వల్ల సత్యాన్ని తిరస్కరించేవారు లోకంలో చాలా మంది పుట్టారు. కాని పుట్టగతులు లేకుండా పోయారు. ఉదాహరణకు కొన్ని సంఘటనలు:

1) అధికార మదాంధతతో సత్యాన్ని తిరస్కరించేవారు ప్రవక్త ఇబ్రాహీమ్ (అ.స) మరియు నమ్రూద్ రాజు యదార్థ గాథను చదివి గుణపాఠం నేర్చుకోవాలి.

ప్రవక్త ఇబ్రాహీమ్ (అ.స) సత్యాన్ని, దైవ ధర్మాన్ని ప్రజలకు తెలియజేస్తూండేవారు. ఆ దేశాన్ని నమ్రూద్ అనే రాజు పరిపాలిస్తుండేవాడు. అతను తన అధికారం - బలం వల్ల అహంకారానికి లోనై "నేనే దేవుణ్ణి! నన్ను పూజించండి" అని ప్రజలను ఆదేశించాడు. కానీ ఇబ్రాహీమ్ (అ.స) 'అందరికీ దేవుడు ఒక్కడే అతను పైనున్నాడు. అతను తప్ప ఎవరూ పూజకు అర్హులు కారు' అనే సత్యాన్ని ప్రచారం చేసేవారు.

ప్రవక్త ఇబ్రాహీమ్ గారి సందేశం రాజు గారికి తెలియజేయబడింది. రాజు ఆగ్రహించి ఇబ్రాహీమ్ (అ.స) గారిని తన సభలోకి పిలిపించి 'ఎవరు నీ దేవుడు? ఏమిటి నీ దేవుని ఘనత?' అని నిలదీశాడు. ఇబ్రాహీమ్ (అ.స) గారు "ప్రాణం పోసేవాడు, ప్రాణం తీసేవాడే నిజ దైవం" అని చెప్పారు. దానికి రాజు, ఓస్ ఇంతేనా ఈ పని నేనూ చేయగలను అంటూ, ఇద్దరు ఖైదీలను పిలిపించి ఒకడి తల తీయించేశాడు. మరొకడ్ని విడుదల చేసి వెళ్ళిపొమ్మన్నాడు. తర్వాత ఇబ్రాహీమ్ గారితో 'చూశావా! నేనూ ఒకరి ప్రాణం తీయగలను, ఒకరికి ప్రాణం పోయగలను' అని ఎద్దేవా చేశాడు.

అప్పుడు ఇబ్రాహీమ్ (అ.స) గారు, సరే గాని దేవుడు సూర్యుడిని తూర్పు దిక్కు నుంచి ఉదయింపజేస్తున్నాడు. నీవు సూర్యుణ్ణి పడమర నుంచి ఉదయించేలా చేయి చూద్దాం? అని సవాలు విసిరారు.



రాజుగారికి ఇది సాధ్యం కాదు. కాబట్టి సమాధానం ఏమి ఇవ్వలేకపోయాడు. రాజుగారి శక్తి ఏపాటిదో తేలిపోయింది. ఇబ్రాహీమ్ (అ.స) ద్వారా అతని ముందు సత్యం రుజువయింది. రాజు తన ఓటమిని అంగీకరించి, సత్యాన్ని స్వీకరించి సన్మార్గంలో నడవాల్సింది పోయి దానికి వ్యతిరేకంగా తన అధికార బలాన్ని ప్రయోగించాడు. ప్రవక్త ఇబ్రాహీమ్ (అ.స) గారిని అగ్నికి ఆహుతి చేయాలని ఆదేశించాడు.

ఆ విధంగా అధికారం నమ్రూద్ రాజులో అహంకారం పెంచింది. అతని ప్రవర్తనను పైనుంచి చూస్తున్న దేవుడు ఆగ్రహించాడు. దేవుడు తన సందేశహరుడైన ఇబ్రాహీమ్ (అ.స) గారిని అగ్ని నుండి కాపాడాడు. నమ్రూద్ రాజుపైకి ఒక దోమను పంపించాడు. ఆ దోమ అతని ముక్కు (లేదా చెవి) ద్వారం గుండా అతని మెదడులోకి ప్రవేశించి కుట్టటం మొదలెట్టింది. రాజు నొప్పికి తట్టుకోలేక విలవిల్లాడిపోయాడు. నొప్పి విపరీతమయ్యేసరికి పిచ్చివానిలా తన చెప్పుతో తలపైన కొట్టుకున్నాడు. దైవాదేశంతో అప్పుడు దోమ ఆగిపోయింది. రాజుకి కాసేపు ఉపశమనం కలిగింది. కాసేపటి తర్వాత దోమ మళ్ళీ తన పనిని దైవాజ్ఞపై మొదలుపెట్టింది. రాజు చెప్పుతో మళ్ళీ కొట్టుకుంటే కాసేపు ఆగి మళ్ళీ తన పని ప్రారంభించేది. రాజు చివరకు ఇద్దరు మనుషులను పెట్టుకున్నాడు. వారిద్దరూ అతని తలపై దెబ్బలు కొట్టేవారు. ఇలా చెప్పు దెబ్బలు తినీ తినీ చివరకు అతని తల బద్దలై హీనమైన చావు చచ్చాడు. అహంకారానికి తగిన శాస్తి జరిగింది.

2) అలాగే పూర్వ కాలంలో ఈజిప్టు దేశంలో ఫిర్‌ఔన్ అనే రాజు పరిపాలించేవాడు. అతను కూడా తన అధికార మదంతో "నేను...నేనే మీ అందరికీ దేవుణ్ణి" అని తన పాలిత ప్రజలకు నమ్మబలికేవాడు. ఆ రోజుల్లో దేవుడు తన సందేశహరుడైన మూసా (అ.స)కు సత్యసందేశం ఇచ్చి ఫిర్‌ఔన్‌కు వినిపించమని ఆదేశించాడు.

మూసా (అ.స) దేవుని ఆదేశం ప్రకారం ఫిర్‌ఔన్ రాజుకి సత్యసందేశం వినిపించారు. ప్రవక్త మూసా (అ.స) మాటలు విని రాజు "నేను తప్ప దేవుడు ఆకాశంలో ఎక్కడున్నాడు? ఓ మంత్రి! ఒక పెద్ద కట్టడం కట్టించు. నేను దానిపైకెక్కి మూసా చెబుతున్న దేవుడు ఆకాశంలో ఏమి చేస్తున్నాడో చూస్తాను" అని ఎగతాళి చేశాడు. దేవుడు ప్రసాదించిన సాక్ష్యాలు అతనికి చూపించి సత్యాన్ని స్వీకరించమని మూసా (అ.స) కోరారు. కాని ఫిర్‌ఔన్ తన అధికారాన్ని చూసుకొని గర్వంతో విర్ర వీగాడు. దేశం నలుమూలల నుంచి పెద్ద పెద్ద మంత్రగాళ్ళను పిలిపించి మూసా (అ.స)ని ఎదుర్కోమని ఆదేశించాడు. కాని అతని మంత్రగాళ్ళు అందరూ ఓడిపోయారు. ఓటమితో పాటు సత్యాన్ని గ్రహించి విశ్వాసులుగా మారిపోయారు.

ఫిర్‌ఔన్ కూడా మంత్రగాళ్ళలాగే సత్యసందేశాన్ని స్వీకరించాల్సింది - కానీ అహంకారంతో మంత్రగాళ్ళందరినీ చంపి వేశాడు. మంత్రగాళ్ళను చంపిందేగాక దైవ సందేశహరులైన మూసా (అ.స)ను, ఆయన అనుచరులను కూడా తుదముట్టించడానికి సైన్యంతో బయలుదేరాడు.

ప్రవక్త మూసా (అ.స) తమ అనుచరులను తీసుకొని వెళ్తుండగా సముద్రం అడ్డు వచ్చింది. దైవాదేశంతో సముద్రంలో దారి తెరువబడింది. మూసా (అ.స) మరియు వారి అనుచరులు ఆ మార్గం ద్వారా సముద్రాన్ని దాటారు. వారిని వెంబడిస్తున్న ఫిర్‌ఔన్ కూడా అదే మార్గం ద్వారా సముద్రాన్ని దాటడానికి ప్రయత్నించాడు. ఫిర్‌ఔన్ మరియు అతని సైన్యం మధ్యలో వచ్చేసరికి దేవుని ఆజ్ఞతో నీళ్ళు రెండు వైపులనుంచి కలిసిపోయాయి. ఫిర్‌ఔన్ తన సైన్యంతో సహా నీట మునిగి అంత మయ్యాడు. దేవుడు అతని దేహాన్ని ప్రళయం వరకు భావితరాల వారికి గుణపాఠంగా మిగిల్చాడు. ఇప్పటికీ అతని మృత దేహం ఈజిప్టు మ్యూజియంలో ఉంది. అహంకారం వల్ల సత్యసందేశాన్ని తిరస్కరించే వారందరికీ గుణపాఠంగా మిగిలి ఉంది.

3) అసూయ వల్ల కూడా చాలా మందిలో అహంకారం ఉంటుంది. ఇలా అసూయకు గురై సత్య సందేశాన్ని తిరస్కరించేవారు ఆది మానవులైన ఆదం (అ.స) మరియు షైతాను మధ్య జరిగిన సంఘటన చదివి గుణపాఠం నేర్చుకోవాలి. దేవుడు మనిషిని పుట్టించక మునుపే దైవదూతలను మరియు జిన్నులను పుట్టించాడు. మానవుని పుట్టుక పూర్వం జిన్ను జాతికి చెందిన 'అజాజీల్' (షైతాన్) చాలా గౌరవంగా దూతల సరసన ఉండేవాడు. తరువాత దేవుడు మొదటి మానవుడు ఆదం (అ.స) గారిని సృష్టించి ఆయన శక్తి సామర్ధ్యాన్ని దూతలకు చూపించి, గౌరవార్థం ఆయన ముందు సాష్టాంగ పడమని ఆదేశించాడు. మానవునికి లభించిన ఈ గౌరవాన్ని చూసి షైతాన్ అసూయపడ్డాడు. అతని అసూయ అతనిలో అహంకారాన్ని జనింపజేసింది. దైవ దూతలందరూ మనిషికి సాష్టాంగపడినా షైతాన్ మాత్రం సాష్టాంగపడలేదు. ఎందుకు? అని దేవుడు ప్రశ్నించాడు. మానవుడు మట్టితో పుట్టిన బలహీనుడు, నేను అగ్నితో చేయబడిన బలవంతుణ్ని అని సమాధానమిస్తూ తన మనసులో ఉన్న అక్కసును మాటల ద్వారా వెళ్ళగక్కాడు. అతని ఈ గర్వం దేవునికి ఆగ్రహాన్ని తెప్పించింది. అహంకారానికి లోనైన దుర్మార్గుడా నీవు ఇక్కడి నుండి వెళ్ళు అని దేవుడు షైతాన్ని ధూత్కరించాడు. షైతాను అహంకారం కారణంగా తన గౌరవ స్థానాన్ని కూడా పోగొట్టుకున్నాడు.

4) మరికొంత మంది డబ్బు కారణంగా అహంకారులుగా మారుతారు. ధన మదంతో యదార్థాన్ని తిరస్కరిస్తుంటారు. ఇలాంటి వారు ఖారూన్ సంఘటనను చదివి గుణపాఠం నేర్చుకోవాలి.

పూర్వ కాలంలో ఇస్రాయీల్ సంతతికి చెందిన ఖారూన్ అనే ఒక పెద్ద ధనవంతుడు ఉండేవాడు. అతని ఖజానాల బీగాలను కొంతమంది యువకులు కలిసి కూడా అతి కష్టం మీద మోయగలిగేవారు. ఇతనికి ధనం ఎంత ఉండి ఉంటుందో ఊహించవచ్చు. అతను అంగరంగ వైభవంతో ఊరేగినపుడు

"గౌరవం నా అంగి. అహంకారం నా శాలువ. వాటిని నా నుండి లాక్కోవ టానికి ప్రయత్నించిన వాణ్ణి నేను శిక్షిస్తాను" అని అల్లాహ్ సెలవిచ్చాడు.
– మహా ప్రవక్త ముహమ్మద్ (స)

ఊరి జనంతో పాటు కొంత మంది విశ్వాసులు కూడా, తమకు కూడా ఖారూన్ లాగానే ధనం ఉంటే ఎంత బావుండు! అని ఆశ పడేవారు.

అదే పట్టణంలో నివసించే కొందరు దైవ భక్తులు, విశ్వాసులు ఖారూన్ దగ్గరకెళ్ళి, 'దేవుడు నీకిచ్చిన ధనంలో కొంత బీద ప్రజలకు పంచు. దేవుడు నీపై కరుణించిన విధంగా నీవు కూడా బీదవారిపై కరుణించు వారిని ఆదుకో. ఈ ప్రపంచం శాశ్వతం కాదు. ప్రళయం కొరకు సత్కార్యాలు, దాన ధర్మాలు చేసుకొమ్మ'ని బోధించారు.

ధన వ్యామోహంలో దారుణంగా చిక్కుకున్న ఖారూన్‌కు వారి హితబోధ చెవికెక్కలేదు. ఈ ధనం తన తెలివి తేటలతో సంపాదించానని అహంకారంతో జవాబిచ్చాడు.

చివరకు జరిగిందేమిటి? రాత్రి సమయాన అందరూ నిద్రిస్తుండగా దేవుడు ఖారూన్ని అతని ఖజానాతో సహా భూమిలో పూడ్చి వేశాడు. తెల్లవారేసరికి అతనుగానీ, అతని మేడగానీ అడ్రస్ లేకుండా పోయింది. ఈ దృశ్యం చూసిన తర్వాత నిన్నటి వరకు ఆశల పల్లకిలో విహరించిన వారందరూ దేవుని దయవల్ల తమకు ఖారూన్ ఖజానా లాంటి ధనం లభించక పోవడమే మంచిదయింది, తాము ఖారూన్ బంధువులం అవకపోవడమే మంచి దయింది, లేదంటే తాము కూడా ఖారూన్‌తో పాటు భూమిలో దిగబడి పోయేవాళ్ళం. దేవుని శిక్షకు గురి అయ్యే వాళ్ళం అని చెప్పుకున్నారు. ఆ విధంగా ఖారూన్ అహంకారం వల్ల తుడుచుకు పోయాడు.

5) చిన్నా పెద్దా తేడా లేకుండా ఎదుటి వారందరినీ చిన్న చూపు చూడటం, నలుగురిలో నవ్వుల పాలు చేయటం కొందరి స్వభావం. ఈ దురలవాటుకు కూడా అహంకారమే కారణం. ఇలా ప్రవర్తించేవారు మహనీయ ముహమ్మద్ (స.అ.సం) వారి జీవితంలో జరిగిన ఓ సంఘటనను చదివి గుణపాఠం నేర్చు కోవాలి.

(మిగతా భాగం 20వ పేజీలో)

# న్యూ ముస్లిం, అరబ్బేతర ముస్లింల కొ
# 8వ దివ్య ఖుర్ఆన్

## మొదటి గ్రూపు
15 ఏండ్లలోపు బాలలకు

1- ఒక పారా కంఠస్థ పోటీ: ⊙ మొదటి బహుమతి 80 KD
⊙ రెండవ బహుమతి 70 KD ⊙ మూడవ బహుమతి 60 KD

2- సగం పారా కంఠస్థ పోటీ: ⊙ మొదటి బహుమతి 60 KD
⊙ రెండవ బహుమతి 50 KD ⊙ మూడవ బహుమతి 40 KD

3- 13 సూరాల కంఠస్థ పోటీ: ⊙ మొదటి బహుమతి 50 KD
⊙ రెండవ బహుమతి 40 KD ⊙ మూడవ బహుమతి 30 KD
(ప్రతి బహుమతికి అర్హులు ఇద్దరు. ఒక బాలుడు ఒక బాలిక చొప్పున)

## రెండవ గ్రూపు
న్యూ ముస్లింలు

1- ఒక పారా కంఠస్థ పోటీ:
2) 20 సూరాల కంఠస్థ పోటీ: (ఇస్లాం స్వీకరించి 3 నుండి 5 ఏండ్లు నిండినవారు)
3- 12 సూరాల కంఠస్థ పోటీ: (ఇస్లాం స్వీకరించి ఏడాది నుండి మూడేండ్లు)
4- 7 సూరాల కంఠస్థ పోటీ: (ఇస్లాం స్వీకరించి ఒక ఏడాది కాలం కూడా కానివారు)

గమనిక: ప్రతి పోటీ మొదటి బహుమతి 80 KD, రెండవ బహుమతి 70 KD, మూడవ బహుమతి 60 KD
(ప్రతి బహుమతికి అర్హులు ఇద్దరు. ఒక స్త్రీ ఒక పురుషుడు చొప్పున)

## మూడవ గ్రూపు
అరబ్బేతర ముస్లింలు

1- 3 పారాల కంఠస్థ పోటీ: ⊙ మొదటి బహుమతి 150 KD
⊙ రెండవ బహుమతి 140 KD ⊙ మూడవ బహుమతి 130 KD

2- 2 పారాల కంఠస్థ పోటీ: ⊙ మొదటి బహుమతి 110 KD
⊙ రెండవ బహుమతి 100 KD ⊙ మూడవ బహుమతి 90 KD

3- 1 పారా కంఠస్థ పోటీ: ⊙ మొదటి బహుమతి 80 KD
⊙ రెండవ బహుమతి 70 KD ⊙ మూడవ బహుమతి 60 KD

4- సగం పారా కంఠస్థ పోటీ: ⊙ మొదటి బహుమతి 60 KD
⊙ రెండవ బహుమతి 50 KD ⊙ మూడవ బహుమతి 40 KD
((ప్రతి బహుమతికి అర్హులు ఇద్దరు. ఒక స్త్రీ ఒక పురుషుడు చొప్పున))

# ...రకు సులైమాన్ సాలెహ్ రుహైమానీ
# ...్ కంఠస్థ పోటీలు

## నియమ నిబంధనలు

- ఈ పోటీలు న్యూ ముస్లింల కొరకు, అరబ్బేతర ముస్లింల కొరకు మాత్రమే ప్రత్యేకం.
- ఈ పోటీలలో స్త్రీలు, పురుషులు కూడా పాల్గొనవచ్చు. ఇరువురికి వేర్వేరు బహుమతులుంటాయి.
- పేర్లు నమోదు చేసే సమయంలో సివిల్ ఐడి తప్పకుండా సమర్పించాలి.
- క్రితం సారి పోటీలలో బహుమతులు గెల్చినవారు మళ్ళీ అదే విభాగంలోగానీ, దానికన్నా దిగువ స్థాయిలో గానీ పాల్గొనలేరు. ఎగువ స్థాయిలో మాత్రమే పాల్గొనవలసి ఉంటుంది.
- దరఖాస్తు ఫారాలు ఇవ్వవలసిన ఆఖరు తేది 23-08-2009
- ఈ పోటీ పరీక్షలు 28,29-08-2009 తేదీలలో జరుగుతాయి.
- బహుమతి ప్రదాన కార్యక్రమం వేరుగా జరుగుతుంది. ఈ తేదీ తరువాత ప్రకటించబడుతుంది.
- దరఖాస్తు ఫారంలో మీ మొబైల్ నెంబరును తప్పక నమోదు చేయాలి.

## మీ పేర్లు నమోదు చేయవలసిన కేంద్రాలు

1) IPC, కువైట్ సిటీ (పురుషులకు మాత్రమే) - 22444117 EXT:151, 110, 105
2) IPC జహ్రా బ్రాంచ్ (స్త్రీలు, పురుషులు కూడా) - 24558830/40
3) IPC ఖైతాన్ బ్రాంచ్ (స్త్రీలు, పురుషులు కూడా) - 24711141, 24735627
4) IPC రౌదా బ్రాంచ్ (స్త్రీలు మాత్రమే) - 22511301/5
5) IPC ఫహాహీల్ బ్రాంచ్ (స్త్రీలు, పురుషులు కూడా) - 23921526
6) KPCC, ఫర్వానియా (స్త్రీలు, పురుషులు కూడా) - 24712574 EXT: 102
7) IPC వఫ్రా, అమ్‌గరా, సబాహియా బ్రాంచ్‌లు (స్త్రీలు, పురుషులు కూడా) వఫ్రా -23810308
8) IPC సాల్మియా - 25733263

## పోటీలు నిర్వహించబడు కేంద్రాలు

IPC, కువైట్ సిటీ మస్జిద్ ముల్లా సాలెహ్, షార ఫహద్ సాలిమ్ (పురుషులకు మాత్రమే)
IPC రౌదా బ్రాంచ్ (స్త్రీలకు మాత్రమే)

## దరఖాస్తు ఫారం

1) పూర్తి పేరు: ..............................
2) కువైట్ సివిల్ ఐడి నెంబరు: ..............................
3) లింగం : పురుషుడు ☐ స్త్రీ ☐
4) ముస్లిం ☐ న్యూ ముస్లిం ☐ ముస్లిం న్యూ ముస్లిం బాలలు ☐
4) నేషనాలిటీ : ..............................
5) టెలిఫోన్ : ..............................
6) గత ఏడాది పోటీలలో పాల్గొన్నారా? అవును ☐ లేదు ☐
7) ఒకవేళ పాల్గొని ఉంటే ఏ గ్రూపులో పాల్గొన్నారు? ☐
8) ఏ గ్రూపులో పాల్గొనాలనుకుంటున్నారు .................... పారాలు/ సూరాల సంఖ్య....................

# వేలం వెర్రి ఈ వెకిలి చేష్ట


– అబుల్ హసన్



ఎలా నమ్మను నువ్వంటున్నది సహేతుకమని?
నీటికి నూకలు చెల్లిపోయాయంటే...
పశ్చిమాన సూర్యుడు ఉదయిస్తున్నాడంటే...
అసంగతాలైన మాటలకు వెవొగ్గుతూ
నిజాన్ని నిర్లక్ష్య ఊబిలో తొక్కేసి
మీస మేషాలు లెక్కిస్తూ కూర్చోమంటే....
ఎలా నమ్మను...
మారాలన్న తపన, ఎదగాలన్న ఆశ అసలొద్దంటే...
మట్టిగా గిరి గీసుకుని భ్రమావరణంలో బ్రతకమంటే...
జీవితానికి అవిటితనం ఆవహించింది... ఇలానే...
అనాలోచితంగా.. అలౌకికంగా.. క్రియాశూన్యంగా జీవించమంటే..
విలువైన సమయాన్ని సులువుగా జారవిడుచుకోమంటే...
విలువల వలువలకు నిప్పంటించి నిందల పాల్జేయమంటే....
ఎలా నమ్మను.....

ఇలానే నువ్వు అంటూ ఉంటే...
అంకెకు రాని ప్రశ్నల చూపులు
నీ ప్రతి చర్యను గమనిస్తూ ఉంటాయి..
అనేకానేక ఆశ్చర్యార్థకపు ముఖాలు - దూతల హస్తాలు
నీ కర్మల్ని అనుక్షణం లిఖిస్తూనే ఉంటాయి..
భువన గగనాలు మూకుమ్మడిగా నీపై శిక్షాగ్నిని కుమ్మరిస్తూనే ఉంటాయి...
నా మాట విను....!

సంఘర్షణలు... సంక్షోభాలు... సంతోషాలు... సందేహ సందోహాలు
బ్రతుకు బాటలో అప్పుడప్పుడు ఎదురయ్యే రుతు విన్యాసాలు
తమస్సును ఛేదించిన తేజస్విలా నిన్ను నువ్వు గెలవాలి
నీలోని నిర్మలత్వం కళ్ళు తెరవాలి. దార్శనిక దృక్పథం అలవడాలి
కోర్కెలకు కళ్ళెం పడాలి. నీరు పడవలో జొరబడకుండా జాగ్రత్త పడాలి
ఊపిరి పక్షి రెక్కలాడిస్తున్నంత సేపే కదా.. జీవితం అంటే...



అందుకే-
వేసవిలో వేడి సహజమైనట్లు...
శీతలానికి చల్లదనం సహజమైనట్లు..
ప్రకృతికి పవిత్రత సహజమైనట్లు..
స్త్రీ పురుషుల సహజీవనం సరైనదని తెలుసుకో
సహస్రకోటి ప్రాణులు సయితం సహించని
స్వలింగ సంపర్కం లజ్జా విహీనం
సృష్టి శ్రేష్ఠుని నుదుట చెరగని కళంకం
అత్యంత భయంకర, నిష్ఠూర, నికృష్ట నరకమని గుర్తించి మసలుకో

ఒక్కసారి పర్యావలోకనం చేసుకో! నువ్వెవరు? నీ గమ్యం ఏది?
మనిషి ఆలోచన సత్యం వైపు పురోగమిస్తే
పాడుబడిన బ్రతుకు ఐంగణాను మళ్ళీ పునర్నించవచ్చు
వాడిపోయిన పూ వనాన్ని తిరిగి మళ్ళీ పూయించవచ్చు
బొగ్గు రాత్రిలో సయితం వెన్నెల ముగ్గులు వేయవచ్చు
పాప భూయిష్టమైన బ్రతుకుని పావనం చేయవచ్చు
పరమోన్నతుడి ప్రసన్నతను పొంది పునీతులవ్వవచ్చు

## అహంకారం : దాని దుష్ఫలితాలు

(17వ పేజి మిగతా భాగం)

ఓసారి మహా ప్రవక్త (స) గారు ఒక వీధి గుండా వెళ్తున్నారు. మార్గ మధ్యంలో ఒక చోట ఓ యువకుడు ఎడమ చేతితో భోజనం చేస్తుండగా చూచి, "ఎడమ చేతితో భుజించటం సంప్రదాయం కాదు నాయనా కుడి చేత్తో భుజించు" అని బోధించారు. కానీ ఆ యువకుడు ప్రవక్త గారి మాటను లక్ష్య పెట్టలేదు. 'నేను ఎడమ చేతితోనే తింటానని' ఎదురు జవాబిచ్చాడు. "ఇకపై నీవు ఎడమ చేతితోనే తింటావులే (కుడి చేతితో తినలేవు నీపైన దైవ శిక్ష పడుతుంది)" అని చెప్పి వెళ్ళిపోయారు.ప్రవక్త (స) గారు వెళ్ళిన కాసేపటికే అతనిపై దైవశిక్ష పడింది. అతని కుడి చేయి పడిపోయింది. (అతను పక్షవాతానికి గురి అయ్యాడు).

6) సమాజంలో అందరూ తన గురించి గొప్పగా చెప్పుకోవాలనీ, తానంటే అందరిలో గౌరవంతో పాటు భయం ఉండాలని కొంత మంది ఉబలాట పడతారు. బయట వీధులలో నిక్కుతూ, విర్రవీగుతూ నడుస్తుంటారు. ఇలాంటి ఆలోచనా ధోరణి ఉన్నవారిలో కూడా అహంకారం ఉంటుంది. ఇలాంటివారు తమ బడాయి కోసం ఎవరి మాటా వినరు. తమను మించిపోవటాన్ని జీర్ణించుకోరు. ఇలా బడాయి కోసం సత్యాన్ని తిరస్కరించేవారు అబూ జహల్‌ని చూసి గుణపాఠం నేర్చుకోవాలి.

మక్కా నగరంలో మహనీయ ముహమ్మద్ (స) ప్రవక్తగా సత్య సందేశం వినిపించే రోజుల్లో అబూ జహల్ అనే ఒకతను ఉండేవాడు. అతడు చాలా తెలివి గలవాడు. ధైర్యశాలి, శక్తివంతుడు కూడా. కానీ బడాయి కోరుకునేవాడు. అదే బడాయి కోసం ప్రవక్త ముహమ్మద్ (స) గారు వినిపించిన సత్య సందేశాన్ని విని కూడా స్వీకరించలేదు. కేవలం బడాయి కోసం అహంకారిగా మారి సత్యాన్ని తిరస్కరించిందే గాక దానికి వ్యతిరేకంగా చేయరాని చేష్టలు అన్నీ చేస్తూ ఎదిరించటం మొదలు పెట్టాడు. కొద్ది రోజులు గడిచిన తర్వాత ఈ బడాయి కోరు ఒక యుద్ధంలో ఇద్దరు పసి పిల్లల చేతికి చిక్కి హీనమైన చావు చచ్చాడు. చచ్చే ముందు కూడా నేను ఎవరైనా బలవంతుని చేత చంపబడి ఉంటే బాగుండునే అని చెబుతూ మరీ చచ్చాడు. ఇలా అబూ జహల్ కేవలం బడాయి కోసం అహంకారియై సత్య సందేశాన్ని తిరస్కరించి, చివరకు హీనమైన చావు చచ్చాడు.

చరిత్రలో ఇలాంటి సంఘటనలు కోకొల్లలు. దైవగ్రంథాలలో, చరిత్ర పుస్తకాలలో ఇవన్నీ భద్రంగా ఉన్నాయి. గర్వంతో సత్యాన్ని ధిక్కరించిన ప్రతి ఒక్కడూ చివరకు అవమానం పాలయి శిక్షను అనుభవించాడు. ప్రళయ దినాన కూడా ఇలాంటి వారికి కఠిన శిక్ష తప్పదు.

నేడు స్వదేశం మరియు పరదేశం రెండు చోట్లా సత్యాన్ని తెలుసుకున్నవారూ, సత్యాన్ని గ్రహించనివారు చాలా మంది కొంచెం డబ్బు, ధనం, అధికారం దొరికే సరికి మీసాలు మెలేస్తున్నారు. పొగరుతో సత్య సందేశం వినిపించేవారిని హేళన చేస్తున్నారు. అసలు సత్యాన్ని వినటానికే సిద్ధంగా లేరు. ఈ కొద్దిపాటి అధికారం, ధనం మత్తులో వారు ఎంతగా మునిగారంటే ఎదుటివారి మాటను వినటం కూడా అనవసరమని భావిస్తున్నారు. ఈ ధోరణి సరైంది కాదు. మనం దైవ శిక్షలకు గురి అవక ముందే మేల్కోవాలి. శిక్షింపబడక ముందే సత్య సందేశాన్ని విని లేదా చదివి అర్థం చేసుకొని దానిని స్వీకరించి దాని ప్రకారమే నడుచుకోవాలి.

మనలోని అహంకారం అణగి పోవాలంటే మట్టితో పుట్టిన మనం తిరిగి మళ్ళీ మట్టిలో కలిసిపోతామన్న వాస్తవాన్ని సమాధులను చూసి అర్థం చేసుకోవాలి. అందరం ఒక రోజు దైవం ముందు నిలబడాల్సి ఉందనే వాస్తవం ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకోవాలి.

# రమజాను పోటీలు

## ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగ పర్చుకోండి

**ఈ పోటీలు వివిధ భాషల్లో నిర్వహించబడుతున్నాయి:**
తెలుగు, తమిళ్, మళయాలం, సింగళం, ఫిలిప్పీనీ, హిందీ, చైనా, నేపాలీ, ఉర్దూ.

### ముస్లిమేతరుల విభాగం

| | |
|---|---|
| మొదటి బహుమతి : | 50 దీనార్లు |
| రెండవ బహుమతి : | 30 దీనార్లు |
| మూడవ బహుమతి : | 20 దీనార్లు |

**గమనిక:** ప్రతి భాషకు చెందిన ముగ్గురిని ఎంపిక చేయడం జరుగుతుంది.

### న్యూముస్లింల విభాగం

| | |
|---|---|
| మొదటి బహుమతి : | 50 దీనార్లు |
| రెండవ బహుమతి : | 30 దీనార్లు |
| మూడవ బహుమతి : | 20 దీనార్లు |

**గమనిక:** ప్రతి భాషకు చెందిన ముగ్గురిని ఎంపిక చేయడం జరుగుతుంది.

### మీ జవాబు పత్రాలు ఇవ్వవలసిన కేంద్రాలు

1) IPC, కువైట్ సిటీ (పురుషులకు మాత్రమే) – 22444117 EXT:151, 110, 105
2) IPC జహ్రా బ్రాంచ్ (స్త్రీలు, పురుషులు కూడా) – 24558830/40
3) IPC ఖైతాన్ బ్రాంచ్ (స్త్రీలు, పురుషులు కూడా) – 24711141, 24735627
4) IPC రౌదా బ్రాంచ్ (స్త్రీలు మాత్రమే) – 22511301/5
5) IPC ఫహాహీల్ బ్రాంచ్ (స్త్రీలు, పురుషులు కూడా) – 23921526
6) KPCC, ఫర్వానియా (స్త్రీలు, పురుషులు కూడా) – 24712574 EXT: 102
7) IPC వఫ్రా, అమ్‌గరా, సబాహియా బ్రాంచ్‌లు (స్త్రీలు, పురుషులు కూడా) వఫ్రా –23810308
8) IPC సాల్మియా – 25733263

# రమజాను పోటీలు
## (ముస్లిమేతరుల కోసం ప్రత్యేకం)

**ఈ క్రింది ప్రశ్నలకు సరైన సమాధానం మీద టిక్ (✓) చేయండి.**

**1) ఇస్లాం అర్థం?**
⊙ ఏకదైవారాధన ప్రాతిపదికగా ప్రవక్తలు తీసుకొచ్చిన ధర్మ శాస్త్రం ⊙ విశ్వ మానవ సమానత్వం ⊙ ప్రాంతీయ మోక్షం

**2) ఇస్లాం విశ్వజనీన ధర్మం, అదొచ్చింది...?**
⊙ అరబ్బుల కొరకు ⊙ విశ్వ మానవాళి కొరకు ⊙ యూరప్, అమెరికా కొరకు

**3) ఆంధ్రుల గురించి ప్రస్తావించిన తొలి ప్రాచీన వాఙ్మయం ఏది?**
⊙ ఋగ్వేదమునకు చెందిన ఐతరేయ బ్రాహ్మణము ⊙ యజుర్వేదము ⊙ అధర్వణ వేదము

**4) ప్రళయం వరకు ఏ విధమైనటువంటి మార్పులు చేర్పులు లేకుండా సురక్షితమైన దైవ గ్రంథం ఏది?**
⊙ సువార్తలు ⊙ దివ్య ఖుర్‌ఆన్ ⊙ తోరాతు గ్రంథం

**5) పురాణాల్లోని ఏ పురాణంలో ప్రవక్త ముహమ్మద్ (స) వారి ప్రస్తావన సవివరంగా ఉంది ?**
⊙ విష్ణు పురాణం ⊙ భవిష్య పురాణం ⊙ శివ పురాణం

**6) విజయవాడ సమావేశంలో జాతీయ పతాకమునకు రూపకల్పన చేసినవారు?**
⊙ పింగళి చెంగయ్య ⊙ పింగళి వెంకయ్య ⊙ పింగళి పుల్లయ్య

**7) 'ఏకం ద్వితీయం నాస్తే' అంటే?**
⊙ సృష్టి పరిపాలకులు ముగ్గురు దేవుళ్ళు ⊙ ముక్కోటి మంది దేవుళ్ళు ⊙ దేవుడు ఒక్కడే, రెండోవాడు లేడు

**8) మొదటి నుంచి చివరి వరకూ కంఠస్థం చేసుకుని, ప్రపంచంలోనే అత్యధికంగా చదవబడే గ్రంథం ఏది?**
⊙ భగవద్గీత ⊙ దివ్య ఖుర్‌ఆన్ ⊙ బైబిల్ గ్రంథం

**9) ఇస్లామీయ సిద్ధాంతం ప్రకారం ఏసు?**
⊙ మరణించారా ⊙ శిలువ వేయబడ్డారా ⊙ దేవుడు తనవైపునకు ఆయన్ను (సజీవంగా) ఎత్తుకున్నాడా

**10) తెలుగు శబ్దానికి ఏ జాతిని కారణంగా భావిస్తారు?**
⊙ తెలగ ⊙ జలగ ⊙ వెలగ

**క్రింది సమాధానాలు కరెక్టా ( ✓ ) కాదా ( × ) తెలుపండి**

1) దైవ ప్రవక్తలందరూ ఏకదైవారాధన, మరణానంతర జీవితం పట్ల విశ్వాసం వైపునకు పిలిచారు ( )
2) ముస్లింలు ముహమ్మద్ ప్రవక్త (స)ను పూజిస్తారు ( )
3) సమగ్ర జీవితానికి సంపూర్ణ స్వరూపం ఇస్లాం ( )
4) ముస్లిం అయిన వ్యక్తి పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు తొడగవచ్చు ( )
5) మనిషి మరణానంతరం తన కర్మల ఆధారంగా స్వర్గానికైనా, నరకానికైనా పోతాడు ( )
6) ముస్లింలు హజ్ చేసేందుకు మక్కా వెళ్తారు ( )
7) ముస్లింలు ఇతర ప్రవక్తలను విశ్వసించరు ( )
8) సృష్టి తనంతట తానే ఉనికిలోకి వచ్చింది ( )
9) ఏ ఇతర సిద్ధాంతాలు ఇవ్వని హక్కులను ఒక ఇస్లాం మాత్రమే స్త్రీకి ఇచ్చింది ( )
10) దేవుడు ప్రతి జీవిని నీటితో సృజించాడు ( )
11) కనీసం 6 మాసాలు తల్లి గర్భంలో ఉన్న శిశువు ప్రసవానంతరం సురక్షితంగా ఉంటాడు ( )
12) ఇస్లాం ఉపవాసాల మాసం షాబాన్ మాసం ( )
13) ప్రవక్తలందరిలోకెల్లా అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) ( )
14) ముస్లింల కొరకు మూడు పండగలున్నాయి ( )
15) త్రికరణ శుద్ధితో 'లా ఇలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదుర్రసూలుల్లాహ్' అని సాక్ష్యమిచ్చి ఇస్లాంలో ప్రవేశించవచ్చు ( )
16) ఇస్లాం ఏకదైవారాధన వైపునకు పిలుస్తుంది, అస్పృశ్యతలు అసమానతలను రూపుమాపుతుంది ( )
17) ఖుర్‌ఆన్‌లో పేరుతో సహా ప్రస్తావించబడిన ఏకైక స్త్రీ మర్యం ( )
18) ఖుర్‌ఆన్ మానవ రచన కాదు, అది దైవ దూత జిబ్రయీల్ ద్వారా దైవ ప్రవక్త ముహమ్మద్ (స)పై అవతరించిన దివ్య వాణి ( )
19) 'నతస్య ప్రతిమ అస్తి' అంటే దైవానికి ఒక ప్రతిమంటూ లేదు (ఆయనను పోలినదేదీ లేదు) అని ( )
20) 'సత్యం వద' అంటే సదా సత్యమే పలుకు, 'ధర్మం చర' అంటే ధర్మ బాటనే నడు అని ( )

**మీ వివరాలు**

పూర్తి పేరు: ..............................................................................

ఐతాఖా నెంబరు: ..............................................................................

☏ టెలిఫోన్ నెంబరు: ..............................................................................

# రమజాను పోటీలు
## (ముస్లిమేతరుల కోసం ప్రత్యేకం)

**ఈ క్రింది ప్రశ్నలకు సరైన సమాధానం మీద టిక్ (✓) చేయండి.**

**1) స్వర్గానికి బీగం చెవి ఏది?**
⊙ నమాజు ⊙ అగత్యపరుల్ని, నిరుపేదల్ని ఆదుకోవటం ⊙ లా ఇలాహ ఇల్లల్లాహ్

**2) బద్ర్ సంగ్రామం ఏ సంవత్సరం జరిగింది?**
⊙ హిజ్రీ శకం 3వ సంవత్సరం ⊙ హిజ్రీ శకం 2వ సంవత్సరం ⊙ హిజ్రీ శకం 1వ సంవత్సరం

**3) ఖుర్‌ఆన్‌లోని పూర్తి సూరాల సంఖ్య?**
⊙ 112 ⊙ 113 ⊙ 114

**4) మహా ప్రవక్త మక్కాలో 13 ఏండ్ల పాటు దేనివైపు పిలిచారు?**
⊙ సంపూర్ణ ధర్మానుసరణ ⊙ తౌహీద్ (ఏక దైవారాధన ⊙ అయిదు పూటల నమాజు స్థాపన

**5) ప్రవక్త (స) వారి మహిమల్లోని అతి పెద్ద మహిమ?**
⊙ దివ్య ఖుర్‌ఆన్ ⊙ చంద్ర ఖండనం ⊙ వ్రేళ్ళ మధ్య నుండి నీళ్ళు ఉబకడం

**6) మూడోవంతు ఖుర్‌ఆన్‌తో సరిసమానమైన సూరా ఏది?**
⊙ అల్ ఫాతిహ్ ⊙ అత్ తకాసుర్ ⊙ అల్ ఇఖ్లాస్

**7) రమజాను ఉపవాసాలు ఎవరిపై విధి?**
⊙ మానవులందరిపై ⊙ యుక్త వయస్సు ముస్లిం స్త్రీ పురుషులపై ⊙ ప్రతి ముస్లింపై

**8) ఘోరాతి ఘోరమైన నేరం ఏది?**
⊙ వ్యభిచారం ⊙ మద్య సేవనం ⊙ బహుదైవారాధన

**9) అల్లాహ్ తన ప్రవక్తల్ని ఎవరి వైపు ప్రభవింపజేశాడు?**
⊙ అరబ్ ప్రజలవైపు ⊙ ఇస్రాయీల్ సంతతి వైపు ⊙ ఆయా సముదాయాల వైపు

**10) మొదటి దైవవాణి ప్రవక్త (స)పై ఎక్కడ అవతరించింది?**
⊙ హిరా గుహలో ⊙ సౌర్ గుహలో ⊙ జబలుర్రహ్మాపై

**కింది సమాధానాలు కరెక్టా ( ✓ ) కాదా ( × ) తెలుపండి**

1) ప్రవక్త (స) వారి తల్లి మక్కాలో మరణించారు ( )
2) తౌహీద్ భాగాలు మూడు ( )
3) అలీ బిన్ అబూ తాలిబ్ (రజి) గారు 'అసదల్లాహ్' అనే బిరుదుతో పిలువబడేవారు ( )
4) ఖుర్‌ఆన్‌లో పేర్కొనబడిన మొత్తం ప్రవక్తల సంఖ్య 25 ( )
5) స్వర్గ ద్వారాల సంఖ్య ఎనిమిది ( )
6) హిజ్రీ శకం 12వ సంవత్సరం ప్రవక్త (స) వారు పరమపదించారు ( )
7) బహిష్టు, పురిటి రక్తం వచ్చే స్త్రీ నమాజు సలపకూడదు ( )
8) నమాజులో మరచిపోతే సజ్దా సహూ తప్పనిసరి ( )
9) ప్రతి ముస్లింపై హజ్జ్ విధి ( )
10) ఉపవాసి మరచి ఏదైనా తిన్నా త్రాగినా ఉపవాసం భంగం అవుతుంది ( )
11) ఇద్దరిలో ఒకరి ద్వారా ఇస్లాం ఖ్యాతి ప్రసాదించు అని ప్రవక్త (స) ప్రార్థించిన ఆ ఇద్దరు ఉమర్ బిన్ ఖత్తాబ్, అబూ జహల్ ( )
12) దైవ దూతలు సైతం ఆతనితో సిగ్గు పడే సహాబీ అబూ బకర్ (రజి) ( )
13) నరక ద్వారాలు ఏడు ( )
14) నమాజు షరతుల్లో బాహ్య పరిశుభ్రత కూడా ఒకటి ( )
15) ప్రవక్త (స) అమీన్, సాదిఖ్ అని కొనియాడబడేవారు ( )
16) ముస్లింల తొలి ఖలీఫా ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) ( )
17) ఒంటరిగా నమాజు చేయడం కన్నా సామూహికంగా నమాజు చేయడం 20 రెట్లు ఎక్కువ పుణ్యాన్నిస్తుంది ( )
18) జనాజా నమాజు ఫర్జె కిఫాయా ( )
19) దేవుని కరవాలం అన్న బిరుదు గల సహాబీ ఖాలిద్ బిన్ వలీద్ ( )
20) ఈద్ నమాజు విధి (ఫర్జ్) ( )

**మీ వివరాలు**

పూర్తి పేరు: ..............................................................

ఖాతా నెంబరు: ..............................................................

☎ టెలిఫోన్ నెంబరు: ..............................................................



న్యూ ముస్లింల పిక్‌నిక్‌లో ఓ దృశ్యం
సాగర తీరాన సరదాగా



ఐ.పి.సి కార్యాలయం నుండి మాలియా ప్రాంతానికి బయలు దేరుతూ





వివేచన



"أللهم بارك لنا في رجب وشعبان وبلغنا رمضان"

- مسند الإمام أحمد (١/٢٥٩)

"ఓ అల్లాహ్! రజబ్, షాబాను మాసాలలో మాకు శుభాన్ని వొసగు. రమజాను (శుభాల) ను పొందే భాగ్యం కూడా ప్రసాదించు".



# స్వైన్ ఫ్లూ

## నుండి రక్షణ పొందటమెలా?




తుమ్ము, దగ్గు వచ్చినపుడు
రుమాలుగానీ, టిష్యూ
పేపరుగానీ ఉపయోగించండి.



ఉపయోగించిన పేపరును వేస్ట్
బాక్స్‌లో పడవేయండి



చేతులను ఎల్లప్పుడూ సబ్బుతో
కడిగి పరిశుభ్రంగా
ఉంచుకోవాలి



'ఫ్లూ' లక్షణాలు కనిపించిన వెంటనే
డాక్టర్ని సంప్రదించండి



మీలో ఈ వ్యాధి లక్షణాలు ఉండి
జనులను కలుసుకున్నప్పుడు కనీసం
ఒక మీటరు దూరంగా ఉండండి



వ్యాధి నిర్ధారణ అయిన మీదట
ఇంటి పట్టునే ఉండండి.
ముఖ్యంగా స్కూళ్ళకు,
జనసందోహంలోనికి వెళ్ళకండి



ఇతరులతో కరచాలనం
చేయటంగానీ, ఆలింగనం
చేసుకోవటం గానీ చేయకండి



చేతులు శుభ్రంగా కడిగే వరకూ
ముక్కు, మొహం ముట్టుకోకండి